తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం   సూర్యపేట   యాద్రాద్రి భువనగిరి

శుక్రవారం
14 ఆగష్టు 2026

పేజీలు : 8

Follow :



## బాధితులకు అన్నివేళలా అండగా ఉంటాం

**ఎస్సీ ఎస్టీలకు అన్యాయం జరగనివ్వం**

**సివిల్ రైట్స్ డే నిర్వహించాలి**

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధితులకు అన్ని వేళలా అండగా ఉంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.గురువారం కలెక్టరేట్ లో కమిషన్ సభ్యులు, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూముల సమస్యలు, దాడుల కేసులు, ఉద్యోగాలలో ఎస్సీ ,ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.వివిధ అంశాలపై సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలకై వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సబ్ ప్లాన్ నిధులు పక్కాగా వినియోగించాలని, నిధులు దారి మళ్లించవద్దని అన్నారు. ఒకవేళ దారి మళ్ళిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.ఎక్కడైనా



సబ్ ప్లాన్ నిధులు మిగిలిపోతే తిరిగి ఎస్సీ, ఎస్టీ కాలనీలలో రోడ్లు, ఇతర పనులు చేపట్టాలన్నారు. ఉద్యోగాలు, ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీలకు తప్పనిసరిగా ఆర్ఓఆర్ అమలు చేయాలని, ఈ విషయంలో అన్యాయం జరిగితే కమిషన్ ఊరుకోదని హెచ్చరించారు.ఎంపీ నిధులు నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఎస్డిఎఫ్ నిధులను రిజర్వేషన్ ప్రకారం కేటాయించాలని అన్నారు.జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి కోర్టు కేసులు జాప్యం లేకుండా పరిష్కరించాలని , శిక్షల శాతాన్ని పెంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీలే పనిచేస్తున్నందున పారిశుద్ధ్య కార్మికులకు **మిగతా 2లో**

## ఉత్పాదకత, నాణ్యత, లాభదాయకత పెంపుపై దృష్టి సారించాలి

**సెంట్రల్ వర్క్ షాప్ ను సందర్శించిన డైరెక్టర్ (ఈ&ఎం) ఎం.తిరుమల రావు**

**భద్రాద్రి కొత్తగూడెం/ ఆగస్టు 14/జనంసాక్షి**
సింగరేణి కార్పొరేట్ పరిధి లో గల సెంట్రల్ వర్క్ షాప్ ను సింగరేణి డైరెక్టర్ (ఈఁడఎం) ఎం.తిరుమల రావు గురువారం సందర్శించారు. డైరెక్టర్ (ఈఁడఎం) ఎం.తిరుమల రావు సెంట్రల్ వర్క్ షాప్ లోని వివిధ విభాగాలను పరిశీలించి, అక్కడ జరుగుతున్న పనుల పురోగతి, ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యత ప్రమాణాలు మరియు నిర్వాహణ కార్యకలాపాలను, ముఖ్యంగా ఫౌండ్రీ సెక్షన్, ఫేబ్రికేషన్, మెషిన్ షాప్ మరియు క్వాలిటి విభాగాల ను సందర్శించి, ఆయా విభాగాలల్లో జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించి, సంబంధిత అధికారులు, సూపర్‌వైజర్లు మరియు కార్మికులతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, పని విధానం, నాణ్యతా మరియు ఉత్పాదకతకు సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. అనంతరం డైరెక్టర్ (ఇడఓ) తిరుమల రావు మాట్లాడుతూ, సెంట్రల్ వర్క్ షాప్ సంస్థకు ఎంతో కీలకమైన విభాగమని, సెంట్రల్ వర్క్ షాప్ ని మరింత అభివృద్ధి చేసి ఉపరితల గనులు, భూగర్భ గనులు మరియు సిహెచ్‌పిలకు అవసరమైన పరికరములు తయారు చేసి అధిక లాభాల్లోకి తీసుకురావడానికి అధికారులు, సూపర్‌వైజర్లు మరియు కార్మికులు సమష్టి గా కృషి చేయాలని కోరారు. రక్షణ మరియు నాణ్యత లో రాజీ పడకుండా, ఉత్పాదకతను పెంచుతూ, వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతను అంకితభావంతో నిర్వర్తిస్తూ, సంస్థ అభివృద్ధి మరియు లాభదాయకత కోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమం లో జిఎం ( ఈ ఁడ ఎం) సెంట్రల్ వర్క్ షాప్ కే.రామ్ మోహన్, డిజిఎం(ఈఁడఎం) లు దర్భ శ్రీనివాస్, కే.వేలాద్రి, ఎస్ఈ (ఈ ఁడఏం) ఆర్.కేశవ రావు, డివై.ఎస్ఈ(ఈఁడఎం) లు పి.నాగేశ్వర రావు, వెంకట రాజు, జేఈ(ఈఁడఎం) డి.నారాయణ రావు, కే.నాగమోహన్, డి.యాదగిరి, జేటిఓ సిహెచ్.శ్రీధర్, జేఎస్ఓ జి.శ్రీనివాస్, సెంట్రల్ వర్క్ షాప్ ఏఐటి?యూసి ప్రతినిధులు నరేశ్, ఐఎన్‌టియూసి ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి మరియు సూపర్‌వైజర్లు పాల్గొని డైరెక్టర్ ఆయా విభాగాల పనితీరును వివరించారు.



## ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలి

**ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంటలు మార్చాలి**

**తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలి:కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు 14, జనంసాక్షి:** సుజాతనగర్ మండలం సింగభూపాలెం, వేపలగడ్డ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి, సంక్షేమ, విద్యా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగభూపాలెం చెరువును సందర్శించిన కలెక్టర్ నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించారు. చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం 19 అడుగులు కాగా, ప్రస్తుతం 14.5 అడుగుల నీరు ఉన్నట్లు అధికారులు వివరించారు. ఈ చెరువు ద్వారా సుమారు 2,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని, పెసర, కూరగాయల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా



రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాత అంజనాపురం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయ పంటలు, పెసర, పత్తి పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కాకరకాయ, సొరకాయ తదితర కూరగాయల సాగును పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వాటి ప్రభావం పంటల సాగుపై పడే అవకాశం తదితర అంశాలను రైతులకు వివరించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగు చేపట్టకుండా తక్కువ నీటితో సాగు చేయగల పెసర వంటి ఆరుతడి పంటలతో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటలను చేపట్టాలని సూచించారు. సింగభూపాలెం గ్రామంలో సుమారు 600 ఎకరాల్లో కూరగాయలు, 300 ఎకరాల్లో పెసర సాగు జరుగుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులకు తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీటి అవసరాలను కాపాడుతూ వున్న నీటిని పొదుపు చెయ్యాలన్నారు .

## మోడికి ట్రంప్ ఫోబియా

**○కమ్యూనిస్టులతో మార్పు తథ్యం ○ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు**

**○తప్పు చేయకపోతే జంకు ఎందుకు? ○సిపిఐ నేత కూనంనేని**





**ఖమ్మం, ఖమ్మం కార్పొరేషన్, (జనంసాక్షి) :**
సువిశాల భారతదేశానికి ప్రధాని అయిన నరేంద్రమోడి పిరికివాడిగా మారిపోయాడని, ఆయనకు ట్రంప్ ఫోబియా పట్టుకుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. 145 కోట్ల జనాభా గలిగిన దేశానికి ప్రధానిగా ఉన్న అల్పసంఖ్యాకులైన సంపన్నులు కార్పోరేట్ల కోసం మాత్రమే పనిచేస్తున్నారన్నారు. సిపిఐ జన చైతన్య యాత్రల ముగింపు సందర్భంగా గురువారం ఖమ్మం నగరంలో పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రల అనంతరం ఖమ్మం జడ్పీ సెంటర్ నుంచి పాత బస్టాండ్, మయూరి సెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వందలాది పార్టీ కార్యకర్తలు, కళాకారుల ప్రదర్శనతో వైరా రోడ్ అరుణావర్ణం పులుముకుంది. భక్తరామదాసు కళాక్షేత్రంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ ప్రజలు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాలు కమ్యూనిస్టు పోరాట ఫలితంగా వచ్చాయని, ఇప్పుడు దేశంలో మార్పు సైతం, కమ్యూనిస్టుల ద్వారానే సాధ్యమవుతుందని ఇది తథ్యమని అన్నారు. ఎన్నికలు ఆర్థిక వ్యవహారంతో ముడిపడి కోట్లు ఖర్చు చేస్తున్నవారు మాత్రమే విజయం సాధిస్తున్న ఈ రోజుల్లో కమ్యూనిస్టులు సీట్లు గెలవలేకపోవచ్చు కాని, గెలుపు ఓటములను, శాసించే శక్తి కమ్యూనిస్టులకు ఉందని సాంబశివ రావు తెలిపారు. మోడి, అమిత్ షాలు తప్పు చేశా మన్న భావనతో ఉన్నారని, అందుకే పార్లమెంట్ వచ్చేందుకు జంకుతున్నారన్నారు. మోడికి తిరోగమనం ప్రారంభమైందని, **మిగతా 7లో**

# సామ్రాజ్యవాదుల సింహస్వప్నం కామ్రేడ్ కాస్ట్రో

○అమెరికాకు వెన్నులో వణుకు పుట్టించిన కాస్ట్రో"

○కాస్ట్రో స్ఫూర్తితోనే కరోనా సమయంలో క్యూబా వైద్యులు ప్రపంచానికి సేవలు

○సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



**భద్రాద్రి కొత్తగూడెం/ఆగస్టు 14/జనంసాక్షి**
అమెరికన్ సామ్రాజ్యవాదుల పట్ల క్యూబా మాజీ అధ్యక్షుడు క్యూబా విప్లవ రథసారథి ఫైడల్ కాస్ట్రో సింహ స్వప్నమని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మంచి కంటి భవన్లో ఫైడల్ కాస్ట్రో శత జయంతి కార్యక్రమం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా కాస్ట్రో చిత్రపటానికి మచ్చ వెంకటేశ్వర్లు పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ అమెరికా తుమ్మితే ప్రపంచానికి జలుబు చేస్తుందన్న నానుడిని వమ్ము చేస్తూ.... అగ్రరాజ్యానికి కంటిమీద కునుకు లేకుండా చేసిన, ధీశాలి, సోషలిస్టు యోధుడనీ కొనియాడారు. అమెరికా తన సామ్రాజ్యవాద చర్యలతో క్యూబాను ఆర్థికంగా చాలా ఇబ్బందులు పెట్టినప్పటికీ ఆర్థిక దిగ్బంధనం చేసినప్పటికీ చిన్న దేశమైన క్యూబా అమెరికాకు సవాలు విసిరే స్థాయికి ఆ దేశాన్ని అభివృద్ధి చేశాడని తెలిపారు. అమెరికా నుండి క్యూబాకు ఎంత దూరమో క్యూబా నుండి అమెరికాకు అంతే దూరం ఉందని అమెరికా అధ్యక్షుని ఎదిరించిన ధైర్యశాలి కాస్ట్రో అని కొనియాడారు. తాను బ్రతికున్నంత వరకు అమెరికన్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా విరామం లేకుండా పోరాటం చేశాడని ఆ పోరాట క్రమంలోనే అగ్రరాజ్యం అమెరికాకు ప్రపంచ దేశాలు గడగడలాడుతున్న సందర్భంలో అమెరికాకు కంటిమీద కునుకు లేకుండా చేసిన దమ్మున్న నాయకుడు కాస్ట్రో అని తెలిపారు. అమెరికా గూడచారి సంస్థ సీఐఏ ఆయన మీద 634 సార్లు హత్యా ప్రయత్నం చేసింది . అయినా ఆయన అమెరికాకు లొంగలేదు. ఎత్తిన ఎర్రజెండా దించేది లేదు అని ప్రకటించాడు."మా దేశం ఇతర దేశాల మీద బాంబులు వేయదు. మా దగ్గర న్యూక్లియర్ బాంబులు గానీ, జీవాయుధాలు గానీ లేవు. మానవాళికి సేవ చేయడానికి ఎప్పుడూ మా వైద్యుల్ని మాత్రం సంసిద్ధుల్ని చేస్తుంటాం". సోషలిస్టు వ్యవస్థలోనే శాశ్వత శాంతి ఉంటుందని నమ్మి క్యూబాలో సోషలిస్టు వ్యవస్థను నిర్మించాడని తెలిపారు. ప్రపంచమంతా కరోనా మహమ్మారితో వైద్య సేవలు అందక అతని కోతలం అవుతున్న సందర్భంలో 150 దేశాలకు చిన్న దేశమైన క్యూబా తమ డాక్టర్ను పంపించి వైద్య సేవలు అందించిందని ఇది మాకు మాజీ అధ్యక్షుడు కాస్త అందించిన స్ఫూర్తి అని ఆ డాక్టర్లు ప్రకటించడం గొప్ప విషయం అని తెలిపారు. నేడు ఫైనాన్స్ క్యాపిటల్ రూపంలో సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాల మీద బుసలు కొడుతుందని కాస్ట్రో స్ఫూర్తితో సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా శాంతిస్థాపన కొరకు కమ్యూనిస్టులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ కే బ్రహ్మాచారి రేపాకుల శ్రీనివాస్ నాయకులు జి రాజారావు ఎం శ్రీను సతీష్ సలీం విజయ్ మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## రెండు దొంగతనం కేసుల్లో

# నిందితులకు మూడేళ్ల జైలు

**నల్గొండ, ఆగస్టు 12,(జనం సాక్షి):**
కనగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు వేర్వేరు దొంగతనం కేసుల్లో నిందితులకు నల్గొండలోని ఎఎఎ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మూడేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది.ట్రాక్టర్ బ్యాటరీల దొంగతనం కేసులో సముద్రాల కృష్ణ, షేక్ టిప్పు సుల్తాన్‌లకు బిఎన్ఎస్ సెక్షన్ 303(2) కింద మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఏడు రోజుల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.మరో బైక్ దొంగతనం కేసులో బిఎన్ఎస్ సెక్షన్ 305 కింద సముద్రాల కృష్ణకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఏడు రోజుల జైలు శిక్ష విధించింది. ఈ కేసులో మరో నిందితుడు షేక్ టిప్పు సుల్తాన్‌ను కోర్టు నిర్దోషిగా ప్రకటించింది.కేసుల్లో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి కనగల్ ఎస్ఐ పి. విష్ణుమూర్తి, ప్రస్తుత ఎస్ఐ కె. రాజీవ్ రెడ్డి, ఏపీపీ ఎన్. కృష్ణయ్య, హెచ్‌సీ పి. నరేందర్, పీసీలు వై. నాగేశ్, ఎన్. మల్లికార్జున్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.దొంగతనాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని, నేరాలకు పాల్పడిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ విలువైన వస్తువుల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 'ఇందిరమ్మ' ఇల్లు

○రెండో విడత సర్వేను వేగవంతం చేయాలి: కలెక్టర్ అంకిత్

○పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై ఆకస్మిక తనిఖీలు

○ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం: కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం/ఆగస్టు 14/ జనంసాక్షి**
అనంతరం సింగభూపాలెం గ్రామంలో మొదటి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులతో పాటు రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న సర్వేను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదటి దశలో గ్రామానికి మొత్తం 32 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 100 శాతం ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ పూర్తయిందని, 11 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. నిర్మాణం పూర్తయిన లబ్ధిదారు మిరియాల అరుణ ఇంటిని పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కోసం జరుగుతున్న సర్వేను పరిశీలించారు. దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి వారి యొక్క ఆర్థిక పరిస్థితి కుటుంబ పరిస్థితి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో మొత్తం 220 దరఖాస్తులు అందగా ఇప్పటి వరకు 92 దరఖాస్తుల సర్వే పూర్తయిందని, ఇందులో 61 పూరి గుడిసెలకు సంబంధించిన సర్వే పూర్తయిందని అధికారులు వివరించారు. మొత్తం దరఖాస్తుల్లో 10 దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తుల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేలో పూర్తి పారదర్శకత పాటిస్తూ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల మేరకు రెండో విడత ఇందిరమ్మ ఇంటి పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం సింగభూపాలెం గ్రామంలో మిషన్ భగీరథ పథకం కింద రూ.49 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సంప్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు 60 శాతం మేర తాగునీటి సరఫరా జరుగుతోందని, ప్రతి ఇంటికి 100 శాతం సురక్షితమైన తాగునీరు అందించేందుకు సంప్ నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. గ్రామంలో రోజుకు సుమారు 2 లక్షల లీటర్ల తాగునీరు అవసరమవుతుందని తెలిపారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సంప్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు కూడా ముందస్తు ప్రణాళికతో తాగునీటి కనెక్షన్లు కల్పించాలని ఆదేశించారు.

అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరో తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందుతున్న సదుపాయాలు, బోధన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్ పఠన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల పఠన సామర్థ్యంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని ఆదేశించారు. తాను మరో నెల రోజుల్లో తిరిగి పాఠశాలను సందర్శిస్తానని, అప్పటికి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, గణితంలో స్పష్టమైన పురోగతి సాధించేలా చర్యలుబీ తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

అనంతరం వేపలగడ్డ గ్రామంలోని మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను పరిశీలించి విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించారు. అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రతిరోజూ అవసరమయ్యే బియ్యం, ఇతర సరుకుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వసతి గృహ పరిసరాలు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.





ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్ బాబు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏవోలు, ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సర్వే బృందాల సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జేబీపీ పోరాటంతో డీపీఆర్ టెండర్ రద్దు

- ○టెండర్ రద్దుతో చేతులు దులుపుకోవడం కాదు..
- ○అవినీతి మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి
- ○ప్రజా పోరాటాలకు ఎవరైనా తలవంచాల్సిందే
- ○జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 13 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్‌లో అవినీతి,అక్రమాలకు వ్యతిరేకంగా జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న నిరంతర ప్రజా పోరాటానికి మరోసారి విజయం లభించిందని ఆపార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు.జైభీమ్ రావ్ భారత్ పార్టీ పోరాటం నేపథ్యంలో డీపీఆర్ టెండర్‌ను రద్దు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.పాల్వంచ ప్రెస్ క్లబ్ లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో యెర్రా కామేష్ మాట్లాడుతూ..ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా,పారదర్శకతకు తావులేకుండా వ్యవహరిస్తే ప్రజా ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలపై న్యాయబద్ధంగా,నిరంతరం పోరాటం చేస్తే చివరకు అధికార యంత్రాంగం కూడా ప్రజల డిమాండ్లకు తలవంచాల్సిందేనని అన్నారు."డీపీఆర్ టెండర్ రద్దు చేయడంతో సమస్య పూర్తయినట్లు అధికారులు భావించకూడదని",టెండర్ ప్రక్రియలో అవినీతి,అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేవలం "టెండర్ రద్దు చేసి చేతులు దులుపుకోవడం ప్రజలను మోసం చేయడమే" అని యెర్రా కామేష్ వ్యాఖ్యానించారు.కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసే ఏ ప్రయత్నాన్నైనా జైభీమ్ రావ్ భారత్ పార్టీ అడ్డుకుంటుందని ఆయన హెచ్చరించారు.టెండర్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించాలని,నిబంధనలను ఉల్లంఘించిన అధికారుల పాత్రపై విచారణ జరిపించాలని, ఇప్పటికే డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ మరియు



ఎన్ఫోర్స్మెంట్,తెలంగాణ విజిలెన్స్ కమిషనర్ కు పిర్యాదు చేయడం జరిగిందన్నారు.ప్రజా సమస్యలపై జేబీపీ పోరాటం ఇక్కడితో ఆగదని యెర్రా కామేష్ తెలిపారు.కొత్తగూడెం కార్పొరేషన్‌లో అవినీతి,అక్రమాలు,ప్రజా నిధుల దుర్వినియోగంపై పార్టీ నిరంతరం నిఘా ఉంచుతుందని అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని యెర్రా కామేష్ స్పష్టం చేశారు,డీపీఆర్ టెండర్ రద్దు ప్రజా పోరాటానికి వచ్చిన ప్రాథమిక విజయమేనని,అయితే అసలు బాధ్యులపై చర్యలు తీసుకున్నప్పుడే పూర్తి న్యాయం జరుగుతుందని అన్నారు.ప్రజా ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్ ,పాల్వంచ, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు నిట్టా నర్సింహ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## లో-వోల్టేజ్ సమస్యకు పరిష్కారం

### సర్పంచ్ అజ్మీర రుక్మాకు గ్రామస్తుల అభినందనలు

**కొత్తగూడెం క్రైమ్ ,ఆగస్టు13(జనం సాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని పాండురంగాపురం తండా గ్రామ పంచాయతీ పరిధిలో కొంతకాలంగా నెలకొన్న విద్యుత్ లో-వోల్టేజ్ సమస్యను గుర్తించిన సర్పంచ్ అజ్మీరా రుక్మ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ మేరకు రూరల్ విద్యుత్ శాఖ ఏఈడీ హుస్సేన్,ఏఈ రవితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.అధికారుల సహకారంతో గురువారం పాండురంగాపురం తండా గ్రామ పంచాయతీలో 25 కేవీ డీపీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.దీంతో గ్రామంలో లో-వోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీరా రుక్మ,ఉప సర్పంచ్ మార్గం అంకయ్య, వార్డు సభ్యులు,విద్యుత్ శాఖ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏడాది నిండని పసికందులాంటి కార్పొరేషన్ ను చిదిమేయకండి



- ❍ 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్'కు అర్హత సాధించిపెట్టా.
- ❍డిపిఆర్ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తాం
- ❍విమర్శల నివృత్తికే ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశం
- ❍రూ.9.60 కోట్ల అవినీతి ప్రచారం అబద్ధం
- ❍అబద్ధపు ప్రచారంతో ప్రజల్లో అనుమానాలు సృష్టించ్చోద్దు
- ❍అది నీతి అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవు
- ❍కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు14/ జనంసాక్షి** అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా నిధులు వెచ్చించి పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఆయా పనులకు సంబంధించిన డిపిఆర్ తయారీ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిధులు మంజూరు కానున్నాయని, పనుల అంచనాల ప్రకారమే కేంద్ర గ్రాంట్లు, రాష్ట్ర వాటా మరియు బ్యాంకుల రుణాల ద్వారా నిధుల సమీకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా లక్ష కోట్ల కేంద్ర సహాయంతోపాటు 25 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రం, 50 శాతం బ్యాంకు రుణం ఉంటుందని, ఇందులో భాగమైన 26 మున్సిపాలిటీల్లో ఖమ్మం కార్పొరేషన్‌కు రూ.2,670 కోట్ల రుణం వస్తుండగా, కొత్తగూడెం కార్పొరేషన్‌కు రూ.600 కోట్ల రుణం అడిగామని వివరించారు. అభివృద్ధి పనుల నిధులపై కాకుండా కేవలం 'వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక టెండర్'కు సంబంధించి కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కూనంనేని మండిపడ్డారు. రూ.600 కోట్ల అంచనా పనులకు 1.6 శాతం చొప్పున డిపిఆర్ టెండర్ ఒప్పందం కుదిరితే, అందులో ఏకంగా రూ.9.60 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో నల్గొండలో 1.6 శాతం, మహబూబ్‌నగర్‌లో రూ.1,000 కోట్ల పనులకు 1.5 శాతంతో ఇలాగే డిపిఆర్ ఒప్పందాలు కుదిరాయని గుర్తుచేశారు. ఇతర పట్టణాలు, మున్సిపాలిటీల్లోనూ ఇదే విధానంలో టెండర్లు జారీ అయినప్పుడు లేని అవినీతి కేవలం కొత్తగూడెంలోనే ఎలా జరుగుతుందని, అక్కడ కూడా అవినీతి జరిగినట్లేనా అని నిలదీశారు. ఆరు నెలల పసిపిల్ల లాంటి కొత్తగూడెం కార్పొరేషన్‌ను పురిటిలోనే చంపాలని కుట్రలు చేస్తున్నారని, అసలు నిధులే విడుదల కాకుండా డిపిఆర్ ఫీజులో కోట్ల రూపాయల అవినీతి ఎలా జరుగుతుందో చెప్పాలన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో అపోహలు సృష్టించారని, ప్రజల్లో ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేయడానికి ఆఫ్‌లైన్ డిపిఆర్ విధానాన్ని రద్దు చేసి ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశాలు ఇచ్చామని స్పష్టం చేశారు. డిపిఆర్ శాతాన్ని 0.5 శాతానికి లేదా మరింత తగ్గించే సామర్థ్యం ఉన్నవారు ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. చుంచుపల్లి ఉమ్మడి పంచాయతీ 45 ఏళు ్లగా సీపీఐ అధీనంలోనే ఉందని, ప్రజాదరణ లేకపోతే తాము ఎన్నికల్లో గెలుస్తామా అని ప్రశ్నించారు. గతంలో ప్రపంచ బ్యాంకు రుణం (టీఎండీపీ) విధానాన్ని వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు లేదా అధికారులు ఎవరైనా తప్పులకు పాల్పడినా, పేదలను మోసం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని, అనవసర ఆరోపణలు చేస్తే వెంటాడతామని హెచ్చరించారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన వివరించారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు ఎండి యూసుఫ్, మునిగడప వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరావు, మునిగడప పద్మ, బోయిన విజయ్ కుమార్, గడ్డం శాంతిప్రియ, గడ్డం వెంకటేశ్వర్రావు, నామా కీర్తి, కూరపాటి సుధాకర్, బండి నర్సింహా, ధనలక్ష్మి, దుర్గయ్య, కళావతి, శ్యామల, మంద నాగమణి, మద్దాల హరిత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో మల్టీ స్పెషాలిటీ వైద్యం



- ○రాంజీ నాయక్ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్
- ○పేదలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం
- ○ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాంజీ నాయక్ హాస్పిటల్ సేవలు

**కొండమల్లేపల్లి, ఆగష్టు 13 (జనంసాక్షి):** అత్యాధునిక వైద్య సేవలను అతి తక్కువ ఖర్చుతో అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రాంజీ నాయక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ రాంజీ నాయక్ వైద్య సేవలు దేవరకొండ ప్రజలకు మరోసారి అందుబాటులోకి వచ్చాయని గతంలో ఆయన అందించిన వైద్య సేవలను పొందిన ప్రజలకు ఈ విషయం సంతోషాన్ని కలిగిస్తోందని అన్నారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యం భారం కాకూడదనే ఉద్దేశంతో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. పట్టణ ప్రజలకు అవసరమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులో ఉండటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు.
రాంజీ నాయక్ హాస్పిటల్‌లో అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ప్రజలకు అందుబాటు ధరల్లో వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఆసుపత్రి నిర్వాహకులకు సూచించారు. వైద్య రంగంలో ప్రజల విశ్వాసాన్ని పొందుతూ దేవరకొండ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ రవి ప్రకాష్, రాంజీ నాయక్ లు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు అతి తక్కువ ఖర్చుతో చికిత్స అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలను విస్తరిస్తామని పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రారంభ కార్యక్రమంలో వైద్యులు ఆసుపత్రి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, స్థానిక ప్రజలు పాల్గొని ఆసుపత్రి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

### హర్ ఘర్ తిరంగా
## భారీ ర్యాలీకి పిలుపు

**టేకులపల్లి,ఆగస్టు 13 (జనంసాక్షి):**



భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ప్రతి ఇంటిపై మన జాతీయ పతాకమైన తిరంగాను ఎగురవేయాలనే లక్ష్యంతో రేపు టేకులపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి బోడ పూనియా నాయక్ తెలిపారు. ఈ ర్యాలీలో కుల,మత,వర్గ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని, జాతీయ ఐక్యతను చాటుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి : మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్

**కల్లూరు ఆగస్టు13(జనం సాక్షి)**
జీవనోపాధి కోసం ఉచిత టైలరింగ్ శిక్షణ తీసుకొని స్వయం ఉపాధి కోసం సి డి ఏ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందించిన కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ స్పష్టం చేశారు.
గురువారంకల్లూరులో సిడిఏ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే తమ కాళ్లపై తాము నిలబడేలా ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. నేను కూడా ఒకప్పుడు టైలర్‌గా కష్టపడి కుటుంబాన్ని పోషించుకుంటూ అంచెలంచెలుగా ఎదిగాను. నేడు మున్సిపల్ చైర్మన్‌గా ఉండటం ఎంతో సంతోషంగా ఉంది. కష్టాన్ని నమ్ముకుని ముందుకు సాగితే ఎవరైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు" అని ఆయన తన జీవిత అనుభవాన్ని పంచుకున్నారు.
రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహకారం తన ఎదుగుదలకు తోడ్పడిందన్నారు.
సిడిఏ కార్యదర్శి, ఏనోష్ కుమార్ మాట్లాడుతూ పేద, మహిళలకు ఐదు నెలలపాటు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు.దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.
ఈకార్యక్రమంలో అసోసియేట్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కౌన్సిల్ నాయకులు, సి డి ఏ సంస్థ నిర్వాహకులు పి ఎనోష్ కుమార్ చంద్ర లీల దంపతులతో పాటు గ్రామస్తులు కాటేపల్లి రజనీకాంత్, కాటేపల్లి కిరణ్, మట్టూరి జనార్ధన్, యాస శ్రీకాంత్ చారుగుండ్ల సందీప్, తేలూరి సంజీవరావు, పలువు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

**ప్రతి గ్రామ సమస్యను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించాలి:**

**ఎమ్మెల్యే బాలు నాయక్**

**గుడిపల్లి మండలంలో రూ.15 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయం నిర్మాణం**

పి.ఏ.పల్లి, ఆగస్టు 13 (జనంసాక్షి):
ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధికారులను ఆదేశించారు. గుడిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన హాజరై వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ నిధులతో పనులు చేపట్టడం కాదని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టడమే లక్ష్యంగా ఉండాలని అన్నారు. అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని సూచించారు.
రైతులకు పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, విత్తనాలు, ఎరువులు, పంటల రక్షణపై వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పించాలని, రైతులకు అందాల్సిన సేవల్లో జాప్యం లేకుండా చూడాలని అన్నారు. భూ సంబంధిత సమస్యలను రెవెన్యూ అధికారులు సకాలంలో పరిష్కరించాలని సూచించారు.గ్రామాల్లో రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు నీటి సంరక్షణ, చెరువుల అభివృద్ధి, పచ్చదనం పెంపు వంటి శాశ్వత ప్రయోజనం కలిగే పనులు చేపట్టాలని తెలిపారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, పేదలు, మహిళలు, యువత సంక్షేమంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు.గుడిపల్లి మండల కేంద్రంలో ఇప్పటికే రూ. 15 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయం నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు.మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ,తహసీల్దార్,మండల ప్రత్యేక అధికారి,వివిధ శాఖల అధికారులు,గ్రామ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్

**కల్లూరు ఆగస్టు 13(జనంసాక్షి)**





కల్లూరు పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు తండ్రి కొత్తపల్లి పుల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆయన దశదినకర్మ కార్యక్రమం గురువారం జరిగింది. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతి నిధులు , నాయకులు కార్యకర్తలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పుల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా కల్లూరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ దారా రంగా మాతృమూర్తి దారా భారతి మృతి చెందడంతో, ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దారా రంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చరవాణి ద్వారా దారా రంగా ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, కల్లూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉస్మాన్, కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రు అర్జున్ రావు, కల్లూరు పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ పార్టీ నాయకుల బైకు ర్యాలీనిరసన

కనగల్లు, ఆగస్టు 13 (జనం సాక్షి)



కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిపిఐ పార్టీ జిల్లా వ్యాప్తంగా కొనసాగిస్తున్న" మార్పు కావాలి"(బద్లావ్ జరూర్ హై) అనే కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రచార బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాపార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు నాయకులు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, సార్వత్రిక విద్య ఆరోగ్యం అందుబాటులోకి తేవాలని, ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం కల్పించాలని, పంటలకు గిట్టుబాటు ధరలపై చట్టబద్ధత తేవాలని, ఎస్ ఎల్ బి సి, డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ఉపాధి హామీ పథకంలో నడుస్తున్న పనులలో కోతలు విధించకుండా కూలీల వేతనాలను పెంచడంతోపాటు, పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, మండల కమిటీ సభ్యులు జోగు సురేందర్, గట్టిగుండ్ల నరసింహ, జినుకుంట్ల సూరయ్య, బోగరి రామకోటి, చిలక రాజు రాములు, జోగు కృష్ణయ్య, కొంకా దేవేందర్, చాడ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



### ఐడీఓసీసాంఘిక సంక్షేమశాఖ గురుకులాల టెండర్లలో
## అక్రమాలను అరికట్టాలి

**విద్యార్థులకు సక్రమంగా సరఫరా చేయని టెండర్ దారులను బ్లాక్ లిస్టులో పెట్టాలి**

**సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల జోనల్ అధికారి కి ఖఆూజ వినతిపత్రం**

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు13 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నీసాంఘిక సంక్షేమ గురుకులాల టెండర్లు, కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని, విద్యార్థుల సంక్షేమ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని( ఖఆూజ )పి డి ఎస్ యు ఆధ్వర్యంలో సంక్షేమ గురుకులాల జోనల్ అధికారి అపర్ణకు గురువారం వినతిపత్రం అందజేశారు.టెండర్దారులు,ప్రిన్సిపాళు ,,అధికారుల మధ్య కుమ్మక్కు జరుగుతోందనే ఆరోపణలు, అధిక ధరలకు కొనుగోళ్లు, నాణ్యత లేని సామగ్రి సరఫరా వంటి ఫిర్యాదులపై స్వతంత్ర విచారణ జరపాలని పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు బుర్ర వీరభద్రం కోరారు.టెండర్ పత్రాలు, ఒ1/ఒ2 వివరాలు, బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, సరఫరా వివరాలను బహిరంగంగా పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో ఫిజికల్ వెరిఫికేషన్, క్వాలిటీ టెస్ట్ నిర్వహించాలని డిమాండ్ చేసారు.విద్యార్థుల కోసం కేటాయించిన ప్రజాధనం దళారులు, కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్తే అనుమతించేది లేదని హెచ్చరించింది. అక్రమాలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గురుకులాల కొనుగోళ్లలో పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేసారు.

## కోతుల దాడిలో గాయపడిన బాలుడికి వైస్ చైర్మన్ ఆర్థిక సాయం

**మోత్కూరు ఆగస్టు 13 (జనం సాక్షి)**
మోత్కూరు మున్సిపల్ పరిధిలోని కొండగడపలో ఇటీవల కోతుల దాడిలో గాయపడిన ఐదేళ్ల బాలుడు తొంట యశ్వంత్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గుప్తా పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న గుప్తా మాట్లాడుతూ కొండగడపలో కోతుల బెడదకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు కోతుల కారణంగా ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండా శోభ సోమల్లు, కారుపోతుల వెంకన్న గౌడ్, మున్సిపల్ కమిషనర్ జీ. నర్సయ్య, మాజీ సర్పంచ్ లింగం యాదవ్, నాయకులు దండేబోయిన వెంకన్న, సుదగని యాదగిరి, సుదగని రాములు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలి

## ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి: సీపీఎం

అశ్వాపురం ఆగస్టు 13 (జనంసాక్షి): మండలంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పూర్తి చేసిన లబ్ధిదారులు ఫైనల్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి తక్షణమే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు దండి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ బిల్లులు అందకపోవడంతో పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలందరికీ పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని దండి రాములు డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ. 2,500, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు, వృద్ధులు మరియు వితంతువులకు రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 6 వేలు అందిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని అన్నారు. పేదల సంక్షేమం కేవలం హామీలకే పరిమితం కాకుండా, వాటిని ఆచరణలో అమలు చేసినప్పుడే ప్రభుత్వానికి ప్రజలపై ఉన్న నిబద్ధత స్పష్టమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల బకాయి బిల్లులు, రెండో దశ ఇళ్ల మంజూరు, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని దండి రాములు డిమాండ్ చేశారు.



# మోడికి ట్రంప్ ఫోబియా

సబ్బండ వర్గాలు మోడి పాలనను వ్యతిరేకిస్తున్నాయన్నారు. ధర్మేంద్రప్రధాన్ రాజీనామాతో మోడి అహంకారం దిగిపోయిందని, యువత ముఖ్యంగా జెనీ ఉద్యమం దేశవ్యాపితమైందని, బిజెపి అధికారం కోల్పోటమే ఇక మిగిలిందని కూనంనేని తెలిపారు. కమ్యూనిస్టులు ప్రపంచ వ్యాపితంగా పురోగమిస్తున్నారని, అందుకే అక్కడ ట్రంప్, ఇక్కడ మోడి బయటపడుతున్నారన్నారు. దేశాన్ని దోచుకుంటూ సంపదను, కార్పోరేట్లకు కట్టబెడుతున్న బిజెపి సర్కార్, ఇప్పుడు అయోధ్య రాముని సొమ్ముకు ఎసరు పెట్టిందని, బిజెపి దాని అనుబంధ సంస్థలు, దొంగల దండుల దేశంపై పడ్డారని, చీమల దండులా కదిలి దొంగల దండును తరిమి వేయాలని సాంబశివరావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయమంటే కాంగ్రెస్ నేతలు బాధపడుతున్నారని, అయినా ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రశ్నిస్తూనే ఉంటామని కూనంనేని తెలిపారు. గెలుపు ఓటములు ఎన్నికల వరకే పరిమితమని, ఒకటి రెండు సీట్ల కోసం ప్రజా సమస్యల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో ఈ సారి పోటీ తథ్యమన్నారు.

**-హామీల అమలుకు పోరాటం : బాగం**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను, అమలు చేయడంలో తాత్సారం ప్రదర్శిస్తుందని, హామీలను విస్మరిస్తే ఆందోళన తప్పదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సన్నబియ్యం, ఉచిత బస్సు మినహా మిగిలిన హామీలలో ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. సిపిఐ ప్రజాచైతన్య యాత్రతో హేమంతరావు మాట్లాడుతూ అప్పుల పేరుతో హామీలను అమలు చేయకపోతే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. బిఆర్ఎస్ డబుల్ బెడ్రూం ఇండ్ల మాదిరే కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో రాజకీయ వివక్ష పాటిస్తుందని, జెండా కప్పుకుంటునే ఇండ్లు కేటాయిస్తామనటం సరికాదు. సీతారామ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలియచేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మోడి ప్రజా వ్యతిరేక విధానాల పైనా, రాష్ట్రంలో హామీల అమలు కోసం నిరంతర పోరాటం కొనసాగుతుందని హేమంతరావు స్పష్టం చేశారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు ప్రసంగించగా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ సభలో సిపిఐ నగర కార్యదర్శి షేక్ జానీమియా, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లైమెంట్, అజ్మీరా రామమూర్తి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి, కళాకారులు సతీష్ బృందం ఆలపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

## బాధితులకు అన్నివేళలా అండగా ఉంటాం

తప్పనిసరిగా ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా ప్రతి నెల చివరి వారంలో తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని ఎస్పీకి సూచించారు. ఈ సమావేశాలకు స్థానిక ఎస్సై, తహసీల్దార్లతో పాటు శాఖపరమైన అధికారులు తప్పక హాజరుకావాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**బాధితులకు ఇళ్లు, ఉపాధి అవకాశాలు**

ఎస్సీ, ఎస్టీ దౌర్జన్యాల నిరోధక చట్టం కింద నమోదు నమోదైన కేసుల్లోని బాధితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి అవకాశాలను వెంటనే కల్పించాలని అధికారులను కోరారు. భూభారతి ద్వారా ఎస్సీ, ఎస్టీల భూసమస్యలు పరిష్కరించేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ ఎస్టీ సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ చేపట్టిన ప్రజెంటేషన్ విధానం బ్రహ్మాండంగా ఉందని ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ప్రతి అంశంపై పూర్తి సమాచారంతో ప్రణాళికలు సిద్ధం చేశారని కొనియాడారు. అదేవిధంగా కేసుల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్పీ నరసింహ వినూత్నంగా ముందడుగు వేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్స్ లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, శంకర్, అదనప కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, ఎస్సి డిడి లత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలి

**- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ వినతి**

బూర్గంపహాడ్ ఆగస్టు 13 (జనంసాక్షి)
బూర్గంపహాడ్ మండలంలో అక్రమ వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ కరెంట్ ఉచ్చుకు గురై మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) బానోత్ నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. విధి నిర్వహణలో భాగంగా అటవీ ప్రాంతానికి వెళ్లిన నవీన్ అక్రమ వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చుకు గురై మృతి చెందిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నవీన్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేస్తున్న వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అటవీ సిబ్బందికి తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ సభ్యులు టి. శోభన్, పి. ఎర్రయ్య, జి. బాబురావు, బి. వెంకన్న, నరేష్, హతిరామ్, శరన్, మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ విగ్రహ పునఃస్థాపనకు అనుమతి ఇవ్వాలి

## అదనపు కలెక్టర్‌కు దళిత సంఘాల వినతి..

అశ్వాపురం, ఆగస్టు 13 (జనంసాక్షి):
అశ్వాపురం మండల కేంద్రంలో గతంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన ప్రదేశంలోనే తిరిగి పునఃస్థాపించేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ దళిత సంఘాల నాయకులు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ డి. వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. విగ్రహం తొలగించి రోజులు గడుస్తున్నా స్పష్టమైన నిర్ణయం వెలువడకపోవడం ఆందోళన కలిగిస్తోందని నాయకులు తెలిపారు. అంబేద్కర్ విగ్రహం సామాజిక న్యాయం, దళిత-బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా పేర్కొంటూ, ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. విగ్రహ పునఃస్థాపనకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు, అనుమతులను పూర్తిగా పాటించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అదనపు కలెక్టర్ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు, బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, మాల మహానాడు జిల్లా కార్యదర్శి కాలవ శాంసన్ తదితరులు పాల్గొన్నారు.



# సారపాకలో అక్రమ ఇసుక నిల్వలపై అధికారుల మౌనం ఎందుకు?

- ఆధారాలతో సమాచారం ఇచ్చినా చర్యలు శూన్యం..
- గతంలో సీజ్ చేసి వేలం వేసిన అధికారులు ఇప్పుడు ఎందుకు వెనుకడుగు?

బూర్గంపహాడ్ ఆగస్టు 13 (జనంసాక్షి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా ఇసుక నిల్వలు చేస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ నాయకులు చుక్కపల్లి బాలాజీ ప్రశ్నించారు. అక్రమ ఇసుక స్టాక్ పాయింట్లకు సంబంధించిన వివరాలు, ఆధారాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ఆయన నిలదీశారు. గతంలో రెవెన్యూ అధికారులు అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్లను సీజ్ చేసి, అనంతరం వేలం ద్వారా ఇసుకను విక్రయించి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చారని బాలాజీ గుర్తుచేశారు. ప్రస్తుతం అదే తరహాలో ఇసుక నిల్వలు కనిపిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. సారపాక మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి పనుల పేరుతో కొంతమంది కాంట్రాక్టర్లు తమ ప్రయోజనాల కోసం ఇసుకను నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఈ వ్యవహారంలో అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు.

**- గ్రామపంచాయతీ కార్యదర్శి సమాధానం చెప్పాలి..**

సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇసుకను ఏ అభివృద్ధి పనుల కోసం, ఎవరి అనుమతులతో స్టాక్ పాయింట్లుగా ఏర్పాటు చేశారో గ్రామపంచాయతీ కార్యదర్శి స్పష్టంగా తెలియజేయాలని బాలాజీ డిమాండ్ చేశారు. అక్రమ ఇసుక తరలింపులు, స్టాక్ పాయింట్లతో తమకు ఎలాంటి సంబంధం లేదని చెబుతూనే మరోవైపు గ్రామ అభివృద్ధి కోసం ఇసుకను తరలించి నిల్వ చేశామని చెప్పడం ఎలా సమంజసమని ప్రశ్నించారు. అక్రమ ఇసుక నిల్వలపై కాలయాపన చేయకుండా సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్టాక్ పాయింట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాలాజీ డిమాండ్ చేశారు. కల్లబొల్లి మాటలతో కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదని, ఇసుక నిల్వల వ్యవహారంపై వాస్తవాలను అధికారులు ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని కోరారు.



# ఖమ్మం జిల్లాలో సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యం వల్లనే ధాన్యం పక్కదోవ పట్టింది

- రైస్ మిల్లర్లను కాపాడుతున్న సివిల్ సప్లై అధికారులు..
- కోట్ల రూపాయల కుంభకోణంలో సివిల్ సప్లై అధికారులకు వాటా ఉంది
- నామమాత్రంగా రైస్ మిల్లర్లకు నోటీసులు ఇచ్చి, తూ...తూ మంత్రంగా ఒకరిద్దరిపై చర్యలు తీసుకున్నారు.
- భారీ కుంభకోణం పై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలి

**ఖమ్మం, (జనంసాక్షి) :**
ఖమ్మం జిల్లాలో సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యం వల్లనే సిఎంఆర్ ప్రభుత్వ ధాన్యం పక్కదోవ పట్టిందని, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ బాబా విమర్శించారు. ఖమ్మం పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025-2026 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న రైస్ మిల్లులకు అప్పగించిన ప్రభుత్వ ధాన్యం రికార్డులను అదేవిధంగా భౌతిక విలువలను పరిశీలించగా కొన్ని వందల కోట్ల రూపాయల ధాన్యం తక్కువగా ఉన్నట్టు తేలిందని, మాయమైన ఈ ధాన్యం విలువ సుమారు కొన్ని వందల కోట్ల రూపాయలు ఉందని ఆయన అన్నారు. రైస్ మిల్లులు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని ప్రభుత్వాన్ని మోసం చేసి ప్రజాధనాన్ని తమ ఖాతాలో రైస్ మిల్లు యాజమాన్యాలు వేసుకున్నాయని, కోట్ల రూపాయలు తిన్న రైస్ మిల్లర్ల యాజమాన్యాలు పెద్ద పెద్ద (ఆడి, బెంజ్) కార్లలో నల్ల కళ్లద్దాలు ధరించి, తిరుగుతున్న ఖమ్మం జిల్లా సివిల్ సప్లై అధికారులకు కనపడటం లేదా అని ఆయన ప్రశ్నించారు. సామాన్యుడు కేవలం వెయ్యి రూపాయలు దొంగతనం చేస్తే ముఖానికి నల్ల కవర్ పెట్టి జైలుకు పంపుతున్నటువంటి చట్టాలు కోట్ల రూపాయల కుంభకోణం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనకడుగు వేస్తుందో వివరించాలని ఆయన అన్నారు. వారిపై సివిల్ సప్లై అధికారులు మరియు ప్రభుత్వం ఎందుకు అంత మెతక వైఖరి అవలంబిస్తుందని ,ఆయన విమర్శించారు. కొందరు రైస్ మిల్లర్లు ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టి దర్జాగా అధికారులు ముందే తిరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు డిఫాల్ట్ మిల్లర్ల నుంచి కోట్లలో రికవరీ చేయాల్సిన అవసరం ఉన్నా కూడా, చర్యలు తీసుకోవడంలో ఖమ్మం జిల్లా సివిల్ సప్లై అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆయన అన్నారు. రైస్ మిల్లర్లకు ఉన్నటువంటి బకాయిలు ఎలా ఎగ్గొట్టాలో సలహాలు సూచనలు ఖమ్మం జిల్లా సివిల్ సప్లై అధికారులే సదరు డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు అందజేస్తున్నారని ఆయన అన్నారు. డిఫాల్ట్ రైస్ మిల్లర్ల యాజమాన్యం నుండి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకొని చట్టంలోని లోసుగులను ప్రభుత్వ బకాయిలను ఎలా ఎగ్గొట్టాలో అధికారులే సూచిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకొని సదరు ఖమ్మం జిల్లా సివిల్ సప్లై అధికారులపై కూడా విచారణ నిర్వహించాలని, ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని "సీఎంఆర్" రైస్ ధాన్యాన్ని పక్కదోవ పట్టించి, కోట్ల రూపాయల కుంభకోణం చేసినటువంటి "బడా రైస్" మిల్లర్ల ఆస్తులను గుర్తించి ప్రభుత్వ బకాయిలను పూర్తిస్థాయిలో రికవరీ చేయాలని, ఖమ్మం జిల్లాలో రైస్ మిల్లర్లకు ప్రజాప్రతినిధుల అండ కూడా ఉందని, సాక్షాత్తు రైస్ మిల్లర్ల యాజమాన్యాలే చెబుతున్నాయని, అదేవిధంగా




అధికారులకు కూడా తాము ముడుపులు చెల్లించబట్టే దర్జాగా తిరుగుతున్నామని, బహిరంగంగానే చెబుతున్నా కూడా చర్యలు శూన్యంగా కనపడుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నామని జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ బాబా పేర్కొన్నారు.

### స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విద్యార్థుల హక్కు

# ఖమ్మం కలెక్టరేట్‌ను ముట్టడించిన ఎస్ఎఫ్ఐ

**ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలి**

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్**

**ఖమ్మం, (జనంసాక్షి) :**
పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌ను వేలాది మంది విద్యార్థులతో ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులను ఆర్థిక ఇబ్బందుల నుంచి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్ని సబ్జెక్టులకు సరిపడా లెక్చరర్లు లేకపోవడంతో విద్యార్థుల చదువులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని ప్రవీణ్ అన్నారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తామని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటికీ అమలు కావడం లేదని విమర్శించారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలోని బీపీఈడి కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉదయం ఐదు గంటలకు గ్రౌండ్‌కు వెళ్లాల్సిన విద్యార్థినులు సుమారు మూడు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని అన్నారు. కళాశాలకు అనుబంధంగా బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందడం లేదని ప్రవీణ్ అన్నారు. హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారంపై ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు తక్షణమే స్పందించాలని ఆయన కోరారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే జిల్లాలో మంత్రులను సైతం అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వంకాయల రాజు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సాత్విక, జిల్లా ఉపాధ్యక్షులు దొంతబోయిన వెంకటేష్, ఖమ్మం డివిజన్ అధ్యక్షులు రెడ్డిపోగుల త్రినాథ్, జిల్లా కమిటీ సభ్యులు భాను, శ్రీకర్, ఎస్ఆర్ఎన్ బీజీఎన్ఆర్ కళాశాల కార్యదర్శి శ్యామ్ తదితర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఘనంగా బోనాల పండుగ

**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని 17వ వార్డ్ చింతలచెరువులో గురువారం కౌన్సిలర్ బైరబోయిన శ్రీదేవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంచం సురేష్, జ్యోతి కరుణాకర్, సుంకరి రమేష్, బాల్ల కుమారస్వామి, సుంకరి



సైదులు, కోడిదల రవి, కోడిదల బిక్షం, కోడిదల వీరయ్య,కుంచం రవి,రేగట్టి సైదులు, శివరాత్రి నాగరాజు,శిరంశెట్టి సైదులు,అల్వాల భద్రయ్య, శివరాత్రి శంకర్, కంచి లింగరాజు, సుంకరి లింగయ్య,అయితగాని జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కోసం వంటగది నిర్మాణం

**యడ్లపల్లి సందీప్ జ్ఞాపకార్థం రూ.70 వేల రూపాయలతో వంటగది వితరణ**





**ఖమ్మం రూరల్,ఆగస్టు 13:(జనంసాక్షి)**
విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎం. వెంకటాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. 70 వేల వ్యయంతో వంటగదిని నిర్మించి వితరణగా అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం అచ్చయ్య?ధనమ్మల మనవడు యడ్లపల్లి సందీప్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పాఠశాలకు వంటగదిని నిర్మించి అందించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీకి వంటగది లేక ఇబ్బందులు ఎదురవుతున్న తరుణంలో ఈ సదుపాయం కల్పించడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రం అచ్చయ్య మాట్లాడుతూ.. సందీప్ జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉపయోగపడే సేవా కార్యక్రమం చేపట్టడం సంతృప్తినిచ్చిందన్నారు.ప్రతి నెల విద్యార్థులకు వివిధ రకాల అంశాలపై వ్యాసరచన ఉపన్యాసం క్విజ్ మొదలగు పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు 1500 వందల రూపాయలు అందించడం జరుగుతుందని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు దాతలు, గ్రామస్థులు ముందుకు రావాలని కోరారు. రానున్న రోజుల్లో తన వంతుగా ప్రభుత్వ పాఠశాలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు.

**-సేవా కార్యక్రమాలు ఆదర్శనీయం.**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాసరావు అన్నారు. వంటగది నిర్మాణానికి సహకరించిన గుర్రం అచ్చయ్య కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు కృపాభాయి విద్యార్థుల భోజన సౌకర్యం కోసం రూ.25 వేల విలువైన బల్లాలను అందించడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో పాఠశాలలో విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేగినాటి విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ కొళ్లపూడి సుమతి, మందపల్లి నాగమణి, యడ్లపల్లి వెంకట రామయ్య, నంద్ర ప్రసాద్, బందెల వెంకయ్య, ఏపీసీ చైర్మన్ రెంటాల భాగ్యమ్మ, మందటి వెంకటరమణ, కుర్ర వెంకన్న,శీలం శ్రీనివాస్,రెంటాల నాగేశ్వరరావు, వార్డు సభ్యులు గుమ్మడి వీరబాబు, రెంటాల శివ, తోకల వెంకన్న, బేతంపూడి నాగరాజు, గుర్రం రమేష్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వరస చోరీలకు గురవుతున్న పంచాయతీ మోటార్ల ఎలక్ట్రికల్ కేబుల్ వైర్

○రెండు నెలలు గడవకముందే మళ్ళీ చోరీ

○రూ.15వేల విలువైన 80మీటర్ల కేబుల్ చోరీ

○పెనుబల్లిలో ఆందోళన కలిగిస్తున్న వరస చోరీలు

**పెనుబల్లి ఆగస్టు 13 (జనం సాక్షి)**
పెనుబల్లిమండలం పెనుబల్లి గ్రామపంచాయతీకి మంచి నీటిని సరఫరా చేసే మోటార్లకు సంబంధించిన రూ. 15వేల విలువ చేసే 80మీటర్ల ఎలక్ట్రికల్ కేబుల్ వైరు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కట్ చేసి దొంగిలించారు. ఇదే బోరుకు సంబంధించి ఎలక్ట్రికల్ కేబుల్ వైర్లు గత జూన్ 23 తారీకున గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. మరల రెండు నెలలు గడవక ముందే గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్ వైర్లు దొంగిలించి ఆందోళనకు గురి చేస్తున్నారు. అంతేకాకుండా పెనుబల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వ్యవసాయ బోర్లకు సంబంధించి ఎలక్ట్రికల్ కేబుల్ వైర్లను కూడా గుర్తుతెలియని వ్యక్తులు తరచూ దొంగిలించడంతో రైతులు కూడా ఆందోళనకు గురవుతున్నారు. పెనుబల్లి గ్రామ రైతులకు అత్యంత బాధాకరమైన విషయం పెనుబల్లి రాథోని లిఫ్ట్ కు సంబంధించిన లక్షలాది రూపాయల విలువ చేసే రెండు ట్రాన్స్ఫార్మర్లకు సంబంధించిన కాపర్ వైర్లను రెండుసార్లు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించడం మరింత ఆందోళనకు గురిచేస్తుంది. ఈ వరుస చోరీలు గ్రామంలోని రైతాంగానికి, ప్రజలకు సాగు, తాగునీటి సరఫరాకు అడ్డంకులుగా మారి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సంబంధిత అధికారులు వరస చోరీలకు అడ్డుకట్ట వేసి గ్రామస్తులను రైతులను ఆదుకోవాలని పెనుబల్లి ప్రజలు కోరుకుంటున్నారు.







## సాగులో ఉన్న గిరిజనేతర పేదలకు పోడు పట్టాలు ఇవ్వాలి

**పెనుబల్లి, ఆగస్ట్13(జనం సాక్షి )**
తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలోగురువారం గిరిజనేతర పేదలకు గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ తాసిల్దార్ కార్యాలయం ముందు ప్రదర్శన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ వీరభద్ర నాయక్ వినతి పత్రం అందించారు. సంఘం మండల అధ్యక్షులు గాయం తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ ఎర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత మూడు, నాలుగు, తరాలుగా ఏజెన్సీలోపోడు సాగు చేసుకుని జీవితాలు గడుపుతున్న గిరిజనేతర పేదలకు పట్టాలు ఇవ్వకుండా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని వారు విమర్శించారు. రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్ సత్యనారాయణ రెడ్డి సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్ విటల్ మాట్లాడుతూ పోడునే నమ్ముకుని పంటలు పండించి అందరికీ ఆహారం ఆనందిస్తున్న పేదలకు రక్షణ కల్పించి పోడు సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



## పెనుబల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై సబ్ కలెక్టర్ సమీక్ష

పెనుపల్లి ఆగస్టు 13 (జనం సాక్షి ) పెనుబల్లి మండలం పెనుబల్లి తహసీల్దార్ కార్యాలయంలోగురువారం కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఐఏఎస్ రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ స్లాట్ల పురోగతి, భూభారతి?రెవెన్యూ సదస్సులకు సంబంధించిన దరఖాస్తులు, సదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు.ప్రజా ఫిర్యాదులు వాటిపై తీసుకున్న చర్యల నివేదికలు , మీ సేవా ద్వారా జారీ చేయాల్సిన ధ్రువపత్రాల పరిష్కారం తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో సమగ్రంగా సమీక్షించారు.ప్రతి అంశంలో పెండింగ్‌ను తగ్గించి, నిర్ణీత గడువులో దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు వేగవంతంగా, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని, ఫిర్యాదులపై తక్షణ స్పందనతో చర్యలు తీసుకుని ఏ టి ఏ లను సమర్పించాలని సూచించారు.అలాగే భూభారతి?రెవెన్యూ సదస్సులు, సదాబైనామా, రిజిస్ట్రేషన్, మీ సేవా దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సబ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## గొల్లపూడి ముస్లింలకు కబ్రస్థాన్, పీర్ల మాన్యం భూమి కేటాయించాలి

### వైరా తాహసిల్దార్ కి వినతి పత్రం

**వైరా జనం సాక్షి :**
వైరా మండలం గొల్లపూడి గ్రామంలోని ముస్లిం ప్రజలకు కబ్రస్థాన్ కోసం స్థలం, పీర్ల మాన్యం కింద సాగు చేసుకునేందుకు వ్యవసాయ భూమిని ప్రభుత్వ భూముల్లో గుర్తించి, నిబంధనల ప్రకారం కేటాయించాలని కోరుతూ గ్రామ ముస్లిం ప్రజలు వైరా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్లపూడి గ్రామంలో ముస్లిం కుటుంబాలు గణనీయమైన సంఖ్యలో ఉన్నప్పటికీ, మరణించిన వారి మృతదేహాలను గౌరవప్రదంగా ఖననం చేసేందుకు ప్రత్యేకంగా కబ్రస్థాన్/ముస్లిం శ్మశానవాటిక స్థలం అందుబాటులో లేదన్నారు. దీంతో ముస్లిం కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో పీర్ల పండుగతో పాటు పీర్లకు సంబంధించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏళ్లుగా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని, వాటి నిర్వహణకు అవసరమైన ఖర్చులు, ఇతర అవసరాల కోసం ఉపయోగపడేలా 'పీర్ల మాన్యం' కింద సాగు చేసుకునే వ్యవసాయ భూమి కూడా లేదని పేర్కొన్నారు.ముస్లిం ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ భూములను పరిశీలించి, కబ్రస్థాన్ కోసం స్థలం, పీర్ల మాన్యం కింద సాగు భూమిని గుర్తించి నిబంధనల ప్రకారం కేటాయించాలని వారు తహసీల్దార్‌ను కోరారు. ఈ సమస్యను అధికారులు సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



# ఘనంగా రేణుకమ్మ జన్మదిన వేడుకలు

**నిత్యం ప్రజాసేవలో ప్రజల పక్షాన పోరాడుతున్న డైనమిక్ లీడర్**

**కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో రేణుకమ్మ పాత్ర ఎనలేనిది - గురిజాల గోపి..**



**మణుగూరు,ఆగష్టు 13 (జనంసాక్షి):**
ఖమ్మం జిల్లా అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో ఆమె పాత్ర ఎనలేనిదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురజాల గోపి అన్నారు. గురువారం మణుగూరు మండలం ముత్యాలమ్మ నగర్ లోని శ్రీ విద్యాభాష్య చారిటబుల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ విద్యార్థుల సమక్షంలో రేణుక చౌదరి జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అనంతరం విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. రేణుక అక్షర మహిళా మండలి ఆధ్వర్యంలో మణుగూరు ఉడతాని గుంపులోని అమ్మ నాన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం అందించారు.ఈ సందర్భంగా గురజాల గోపి మాట్లాడుతూ...ఖమ్మం జిల్లా ముద్దుబిడ్డ, డైనమిక్ లీడర్, కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి జన్మదినం సందర్భంగా వారికి నా తరఫున, మన మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల తరఫున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆమె రాజకీయాల్లో అగ్నిశిఖ లాంటివారు. పార్లమెంట్‌లో అయినా, ప్రజల్లో అయినా ప్రజా సమస్యలపై ఆమె గళం విప్పే తీరు మనకందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం. కేంద్ర మంత్రిగా ఆమె మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా దేశంలోని మహిళల హక్కుల రక్షణ కోసం గృహ హింస నిరోధక చట్టం వంటి ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు.ఖమ్మం జిల్లా అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో ఆమె పాత్ర ఎనలేనిది. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ, ప్రజల పక్షాన పోరాడుతున్న ఆమెకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నాను. ప్రజా ప్రభుత్వంలో రేణుకమ్మ మార్గదర్శకత్వం మనకు ఎల్లప్పుడూ అవసరం. రాబోయే రోజుల్లో ఆమె మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాము."ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యువజన నాయకులు, విద్యార్థిని విద్యార్థులు వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.


## ఆర్టీసీ బస్ సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



**పెనుబల్లి ఆగస్టు 13 (జనంసాక్షి)**
సత్తుపల్లి నుండి లంకాసాగర్ క్రాస్ రోడ్ మీదుగా కృష్ణా జిల్లా తిరువూరు వెళ్లే మార్గంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు, విద్యార్థులు నానా ఇబ్బందులకు గురి అవుతున్నామని తమ బాధని వ్యక్తం చేస్తున్నారు. పెనుబల్లి మండలంలో ఏ గ్రామానికి ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం లేని రోజుల్లోనే సత్తుపల్లి నుండి లంకా సాగర్ మీదుగా నాలుగు సర్వీసులు ఉండేటటువంటి ఆ రూట్ లో ఇప్పుడు కేవలం ఉదయం ఒక సర్వీస్ సాయంత్రం ఒక సర్వీస్ మాత్రమే ఉన్నదని,దీంతో అనేకగ్రామాలు ఉండి పారిశ్రామికంగా, విద్యా, వైద్య పరంగా అభివృద్ధి చెందుతున్న ఈ రూట్లో బస్ సర్వీసులు లేకపోవడంతో నానా అవస్థలకు, వ్యయ ప్రయాసలకు గురవుతున్నామని తమ గోడు వినిపిస్తున్నారు,ఆర్టిసి అధికారుల దృష్టికి ఎన్నిసార్లు సమస్యలు తీసుకెళ్లినా స్పందించడం లేదని లంకాసాగర్ మాజీ సర్పంచ్ మందడపు అశోక్ కుమార్ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా బస్సు సర్వీసుని ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ముత్యాలమ్మ జాతరకు ముస్తాబవుతున్న ముత్యాలమ్మ గుడి

**పెనుబల్లి, ఆగస్ట్ 13(జనం సాక్షి )**
శ్రావణమాసంలో ముత్యాలమ్మ జాతరకు ముస్తాబవుతున్న గ్రామ దేవత పెనుబల్లి ముత్యాలమ్మ గుడి. పెనుబల్లి మండలం పెనుబల్లి గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం ప్రతి ఏటా శ్రావణమాసంలో భక్తిశ్రద్ధలతో గ్రామస్తులందరూ కలిసికట్టుగా జరుపుకునే ముత్యాలమ్మ జాతర కు అమ్మవారి దేవస్థానం అన్ని హంగులతో కమిటీ ఆధ్వర్యంలో ముస్తాబవుతుంది. ఈ ఏడాది ప్రత్యేకంగా అమ్మవారి గుడిపై గోపురం ఏర్పాటుచేయడం జరిగింది. ప్రతి ఏడాది గ్రామంలో శ్రావణమాసం ప్రారంభం నాటికి రైతులు వరి నాట్లు పూర్తిచేసుకుని గ్రామదేవత ముత్యాలమ్మకు గ్రామస్తులందరూ కలిసి ఒకేరోజు బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో కోలాహలంగా ముత్యాలమ్మ జాతర నిర్వహిస్తారు. ఈ జాతరలో మహిళలు, రైతులు సమృద్ధిగా వర్షాలు పడి, పంటలు పండాలని రైతులకు మేలు జరగాలని గ్రామ దేవత ముత్యాలమ్మ ను వేడుకుంటారు.




# స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు ఆర్థిక పురోగతి మందగమనం

○నిరుద్యోగం భారం.. భవిష్యత్ తరాలపై ప్రశ్నార్థకం..

○సగటు మనిషిని మానసికంగా, ఆర్థికంగా కుంగదీస్తోంది...!!

○పథకాల విధానంలో మార్పు కోరుతున్న ప్రజలు..

○"ఉచితం కంటే ఉపాధి తోనే ఆర్థిక వృద్ధి..











**మణుగూరు, ఆగస్టు 13 జనంసాక్షి ):** దేశం స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు పూర్తయింది. కానీ ఈ ఏడున్నర దశాబ్దాల ప్రయాణంలో ఆశించిన స్థాయిలో ఆర్థిక వృద్ధి కనిపించడం లేదనే ఆందోళన సామాన్య ప్రజల్లో, యువతలో పెరుగుతోంది. ఉపాధి అవకాశాలు తగ్గుతుండగా, నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతోంది. నలుగురిలో ఆత్మగౌరవంతో బ్రతకడానికి 'నేను బాగున్నాను' అనే ముసుగు వేసుకుని...లోపల కన్నీటిని మింగుకుంటూ కాలం వెళ్లదీయడమే సగటు మనిషిని మానసికంగా కుంగదీస్తోంది...!!ఈ 'ఆగానికి' అసలు కారణం మనుషుల సోమరితనం కాదు, స్పష్టమైన దూరదృష్టి లేని పాలనా వ్యవస్థాగత వైఫల్యం...!!చదువుకున్న చదువుకు, పడుతున్న కష్టానికి తగిన ఉపాధిని సృష్టించకుండా, తాత్కాలిక ఊరటనిచ్చే పథకాలతో లేదా అంకెల్లో చూపించే ప్రకటనలతో సర్దుబాటు చేయాలనుకోవడం పాలకుల ప్రాథమిక అజ్ఞానం...!!శ్రమించే నైపుణ్యాలు సిద్ధంగా ఉన్నప్పుడు, వాటికి తగిన మార్గాన్ని చూపని వ్యవస్థ ఏ సమాజాన్నీ ముందుకు తీసుకెళ్లలేదు...పాలకుల ప్రాధాన్యతలు నిజమైన ప్రజల అవసరాలకు పూర్తి భిన్నంగా ఉండటమే ఈ తీవ్రమైన అసమానతకు మూలం...!!

**పథకాలపై ఆధారపడే ధోరణి;**

గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఉచిత పంపిణీల కారణంగా ఒక వర్గం ప్రజల్లో పని చేయాలనే తపన తగ్గుతోందనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. "రేషన్, నగదు సాయం, ఉచితాలు వస్తున్నాయి కదా అని చాలా మంది కూలి పనికి, చిన్న ఉద్యోగాలకు కూడా వెళ్లడం లేదు. దీంతో కార్మిక కొరత ఏర్పడుతోంది" అని స్థానిక వ్యాపారులు అభిప్రాయపడ్డారు. మనుషులున్న పని చేసేవారు లేక వేరే ప్రాంతాల నుంచి కార్మికులను తెచ్చుకోవాల్సిన పరిస్తితి వచ్చిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. స్వల్పకాలిక ఉపశమనం కోసం ఇచ్చే పథకాలు దీర్ఘకాలంలో ఉత్పాదకతను దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఉత్పత్తి పెరగకుండా పంపిణీలు పెరిగితే ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందని వారు హెచ్చరిస్తున్నారు.

**యువత భవిష్యత్ ఏంటి?:**

వేలల్లో, లక్షల్లో ఫీజులు కట్టి డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన యువత ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఆలస్యం, ఒకవేళ కష్టపడి చదివిన పేపర్ లీకేజీ.. పోనీ ప్రైవేట్ రంగంలో ప్రయత్నం చేస్తే నైపుణ్యం లేని కారణంగా అవకాశాలు చేజారిపోతున్నాయి. "మాకు చదువు చెప్పించారు, కానీ ఉద్యోగం ఇవ్వలేదు. ప్రతి ఇంట్లో ఒకరికి పథకం డబ్బు వస్తోంది, కానీ నిలదొక్కుకునే మార్గం చూపడం లేదు. ఇలాగే ఉంటే మా తర్వాత తరం ఇంకా కష్టపడాల్సి వస్తుంది" అని నిరుద్యోగ యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పార్టీలు, ప్రభుత్వాలు మారిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించ లేకపోతున్నాయి.ఇలాగే కొనసాగితే...ఆర్థిక వృద్ధి లేకుండా, ఉద్యోగ కల్పన జరగకుండా, పథకాలపైనే ఆధారపడే సంస్కృతి కొనసాగితే భవిష్యత్ తరాల పరిస్థితి ఆందోళన కరంగా ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.పని చేయకుండా అలవాటు పడితే వచ్చే తరానికి కష్టపడే గుణం తగ్గుతుంది. ప్రభుత్వ ఖజానాపై ఒత్తిడి పెరిగి, అభివృద్ధి పనులకు నిధులు తగ్గే అవకాశం ఉంది. సొంత ప్రాంతంలో అవకాశాలు లేక యువత ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వలస వెళ్లాల్సి రావచ్చు. స్వాతంత్ర్యం తెచ్చుకున్న లక్ష్యం స్వావలంబన. కానీ 79 ఏళ్ల తర్వాత కూడా మనం ఉచితాల చుట్టూ తిరుగుతూ, ఉత్పత్తి కంటే పంపిణీకే ప్రాధాన్యం ఇస్తే, వచ్చే తరాలకు బలమైన ఆర్థిక పునాది ఎలా వేస్తామన్నదే ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారుతోంది.

**"ఉచితం కాదు, ఉపాధి కావాలి":**

పథకాలు ఉచితంగా వద్దు ఆ పథకం పది మందికి ఉపాధి కల్పించే విధంగా ఉండాలి" అనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.ఉచిత నగదు బదులు స్వయం ఉపాధి కోసం టూల్స్, మిషన్లు, ముడి సరుకు సబ్సిడీ ఇవ్వాలి. 10 మంది మహిళలకు కుట్టు మిషన్లు ఆర్డర్లు ఇప్పిస్తే వారు నెలకు 20 వేలు సంపాదించవచ్చు.గ్రామీణ పరిశ్రమలకు ప్రోత్సాహం అందించే విధంగా ప్రతి మండలంలో చిన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, చేనేత క్లస్టర్, అగ్రి ప్రాసెసింగ్ కేంద్రం పెడితే కనీసం 50-100 మంది యువతకు ప్రత్యక్ష ఉపాధి వస్తుంది. పథకం నిధులను ఇలాంటి యూనిట్లకు మళ్లించాలి."పని చేస్తేనే పథకాల సాయం" 100 రోజుల పని లాగా నిర్మాణం, వ్యవసాయం, బ్యాగుల తయారీ, పర్యాటకం లాంటి రంగాల్లో నైపుణ్య శిక్షణతో కూడిన ఉపాధి ఇవ్వాలి."ఒక కుటుంబానికి నెలకు 2000 ఇవ్వడం కంటే, ఆ కుటుంబంలో ఒకరికి నెలకు 15000 వచ్చే ఉపాధి కల్పిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. పథకం బడ్జెట్ లో 70 శాతం ఉత్పాదక పనులకు, 30శాతం మాత్రమే ప్రత్యక్ష సాయానికి కేటాయించాలి" ఇలా చేస్తే తర్వాతి తరం "సోమరిపోతులు" కాదు, "పారిశ్రామిక వేత్తలు" అవుతారు.



## సర్పంచ్‌ల సంఘం నూతన కార్యవర్గానికి సన్మానం

**ఖమ్మం, (జనంసాక్షి) :**
వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలం గుండెపుడి గ్రామంలో నూతనంగా ఎన్నికైన మండల సర్పంచ్‌ల సంఘం కార్యవర్గానికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు గాదె కృష్ణయ్య, సర్పంచ్ భూక్యా అరుణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ నాయకుడు దుద్దుకూరి సుమంత్ కార్యక్రమానికి హాజరై సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూక్యా ప్రసాద్, ఉపాధ్యక్షురాలు బానోత్ సుమలత, ప్రధాన కార్యదర్శి కోర్స రమేష్‌లను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సర్పంచ్‌లు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. భూక్యా ప్రసాద్ నేతృత్వంలోని సర్పంచ్‌ల సంఘానికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సర్పంచ్‌లు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మండలంలోని సర్పంచ్‌లు ఐక్యంగా పనిచేసి మండల అభివృద్ధికి, గ్రామ ప్రజల సంక్షేమానికి నిరంతరం పాటుపడాలని కోరారు. కార్యక్రమం నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు దుద్దుకూరి సుమంత్, గాదె కృష్ణయ్య, సర్పంచ్ భూక్యా అరుణలకు సర్పంచ్‌ల సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సూరారం సర్పంచ్ జగన్నాథం, కొమ్ముగూడెం సర్పంచ్ జ్యోతి, వినోబానగర్ సర్పంచ్ గంగవత్ నవీన్, గంగారాం తండా సర్పంచ్ మంగీలాల్, నల్లభండబోడు సర్పంచ్ సింధు, భూక్యా నర్సింహారావు, పూనెం నవీన్, వల్లమల దిలీప్, బోడ హరిబాబు, బానోత్ అశోక్, అజ్మీరా నరేందర్, చింటు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని తహసిల్దార్ కు వినతి పత్రం

పి.ఏ.పల్లి,ఆగస్టు 13 (జనంసాక్షి ):
ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని పి.ఏ.పల్లి తహసిల్దార్ జయశ్రీ కి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయులకు పి.ఆర్.సి ని వెంటనే ప్రకటించాలని,పెండింగ్ డీఏ లు విడుదల చేయాలని,ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా టీఎస్ యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఆడావత్ చిన వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే పిఆర్సి ని ప్రకటించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ పి.ఏ.పల్లి మండల అధ్యక్షులు మరియు కార్యదర్శులు పి.జీవన్ కుమార్, వి.సతీష్,సభ్యులు పి.వెంకటేశ్వర్లు,బాలకృష్ణ , యాదయ్య,హరికృష్ణ,సువర్ణ మరియు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు

**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 13 (జనం సాక్షి ):** మండలంలోని వంకమామిడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ 7వ వార్డు సభ్యుడు ఎల్లండి ప్రభాకర్ భార్య మణికేశ్వరి ఆకస్మికంగా మృతి చెందడంతో, వంకమామిడి బీఆర్ఎస్ పార్టీ ఉపసర్పంచ్, మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బొమ్మగోని పరమేష్ గౌడ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు వంగల కిషన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మచ్చ నరసింహ, సుర్వీ శివ, బొడిగే మల్లేశం, మచ్చ యాదగిరి, సుర్వీ నరసింహ, దుర్గ, భీమా, రాము తదితరులు పాల్గొన్నారు.



## మన గ్రోమోర్ ఆధ్వర్యంలో రైతు సంకల్పయాత్ర

**నూతనకల్ ఆగస్టు 13 (జనంసాక్షి)**
లింగంపల్లి గ్రామంలో మన గ్రోమోర్ సెంటర్ నూతనకల్లు వారి ఆధ్వర్యంలో సావరాన్, మెట రైతు సంకల్పయాత్ర రైతు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రైతులకు వరి మరియు పత్తి పంటలలో ఎరువులు, పురుగుమందులు, సేంద్రీయ ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలు సరైన వినియోగ విధానంపై అవగాహన కల్పించారు. పంటల అవసరాలకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదాస్ చిన్న వెంకన్న ,జోనల్ మార్కెటింగ్ మేనేజర్ రాజేష్,ఏరియా మార్కెటింగ్ మేనేజర్ తిరుపతి రెడ్డి, మేనేజర్లు చిరంజీవి, వెంకటేష్, సైదులు, కరుణాకర్, నాగరాజు, అంజయ్య, సురేష్, యాదగిరితో పాటు రైతులు లింగయ్య, పుల్లయ్య, వెంకన్న, మల్లయ్య, చారి, ఏక సాయిలు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సమతుల్య ఎరువుల వినియోగం మరియు పంటలలో సరైన ఉత్పాదకత సాధించే విధానాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.



# మాల్ లైఫ్‌స్టార్ ఆసుపత్రిలో అత్యాధునిక శస్త్రచికిత్స

○ లైఫ్‌స్టార్ ఆసుపత్రిలో అరుదైన ఘనత

○ ఒకే సిట్టింగ్‌లో రెండు మోకాళ్ల మార్పిడి..

○శస్త్రచికిత్స అనంతరం రోగిని నడిపించిన వైద్య బృందం








**మర్రిగూడ, ఆగస్టు 13 (జనంసాక్షి)**

మాల్ లైఫ్‌స్టార్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవల్లో భాగంగా ఒకే సిట్టింగ్‌లో రెండు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆర్థో సర్జన్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలోని వైద్య బృందం ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. సర్జరీ అనంతరం రోగిని వైద్య బృందం నడిపించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

స్థానికంగానే అత్యాధునిక వైద్యం మోకాళ్ల సమస్యలకు శస్త్రచికిత్స అవసరమైనప్పుడు హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా మాల్‌లోనే ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం స్థానిక ప్రజలకు ప్రయోజనకరంగా మారింది. రెండు మోకాళ్లను ఒకేసారి మార్చే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం ఆసుపత్రి వైద్య సేవల సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్లు పి. వినోద్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఆధునిక వైద్య సేవలను మాల్ లైఫ్‌స్టార్‌లో అందిస్తున్నామని తెలిపారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యమన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా మరిన్ని అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. మాల్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు లైఫ్‌స్టార్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సొంత ప్రాంతంలోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి రావడంతో మాల్ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలపై భరోసా పెరుగుతోంది.



## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం

**- కోరిటికల్ గ్రామ సర్పంచ్ కట్టెకోల సుశీల హనుమంతు గౌడ్**

**ఆత్మకూర్ (ఎం)జనంసాక్షి ఆగస్టు (13)**

ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదేశాల మేరకు కొరటికల్ గ్రామంలో గురువారం రోజునమార్నింగ్ వాక్ చేసిన కాంగ్రెస్ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా ప్రభుత్వం ఎలా ఉంది అని అడగగా అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి అని ప్రజలు సంతోష వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టెకోల సుశీల హనుమంతు గౌడ్ ఉప సర్పంచ్ మామిడి నర్సిరెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వనమాల కృష్ణ కందటి దశరథ రెడ్డి రాగటి యాదగిరి గౌడ్ బొడిగె వెంకటయ్య గౌడ్ శ్రీరాముల బహన ఋషి దేవస్థాన కమిటీ చైర్మన్ మురారి శెట్టి సురేష్ గుప్తా కట్టేకోల రమేష్ గౌడ్ దంతూరి దేవయ్య చామకూర ఉపేందర్ రంగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పై కాంగ్రెస్ నాయకుల మార్నింగ్ వాక్



**ఆత్మకూర్ (ఎం)జనం సాక్షి ఆగస్టు (13)**

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు ఆత్మకూరు మండల కేంద్రంలో ని అన్ని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించిన మార్నింగ్ వాకింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్, ఉచిత కరెంటు,రైతు సంక్షేమం, మహిళలు మరియు పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ, నాయకులు తమ వద్దకు వచ్చి సమస్యలను నేరుగా తెలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల,పట్టణ, గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యార్థి నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలి..

**బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి**

**పచ్చిపాల రామకృష్ణ యాదవ్**

**కోదాడ,( జనం సాక్షి):**

రాష్ట్రంలో పెండింగ్ లోఉన్న 8500 కోట్ల ఫీజు బకాయలను చెల్లించాలని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, హాస్టల్ విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలు, మెస్ చార్జీలు, పెంచి హాస్టల్ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతూ కోదాడలో విద్యార్థుల నిరుద్యోగుల ఆత్మ బలిదానాలు ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఫీజుబకాయలు మంజూరు చేయగా విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు . అలాగే హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని నిరుద్యోగులకు ఉద్యోగ భృతి చెల్లించాలని యువతకు ఉపాధి కల్పించాలనీ నియోజకవర్గానికి ఒక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని నిరుద్యోగ యువత ఉద్యోగాలు లేక క్యాటరింగ్ సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని యువత ఆత్మహత్యలు చేసుకోక ముందే ప్రభుత్వాలు యువత ఉపాధి కల్పనకు పెద్ద పేట వెయ్యాలన్నారు లేని పక్షంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యుడు ఆర్ .కృష్ణయ్య బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ నాయకత్వం లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సతీష్, నరేష్, మహేష్ నాగరాజు, రాంబాబు ,వినయ్ ,ప్రదీప్, శీను తదితరులు పాల్గొన్నారు.

## భారత దేశ నమూనాలో క్రిష్ణవేణి విద్యార్థులు

**రామన్నపేట, ఆగస్టు 13 (జనంసాక్షి):**



ఈ నెల 15 న జరుగబోయే భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు గురువారం వినూత్నంగా తమ పాఠశాల ప్రాంగణంలో భారత దేశ నమూనాను ప్రదర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులచే వినూత్నంగా నిర్వహించిన భారత దేశ నమూనా ప్రదర్శన పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. వినూత్నంగా ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె. మణి అభినందించారు.

# ఆత్మకూర్ మండలం లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం



ఆత్మకూర్ (ఎం) జనం సాక్షి ఆగస్టు 13

మండల కేంద్రం లో గురువారం రోజున ' హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశభక్తి, జాతీయ ఐక్యత మరియు దేశ సమగ్రతను చాటుతూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత మరియు ప్రజలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్ మాట్లాడుతూ, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో దేశభక్తి భావనను పెంపొందించడంతో పాటు, జాతీయ జెండా పట్ల గౌరవాన్ని చాటడమే లక్ష్యమని తెలిపారు. దేశ సమగ్రత, ఐక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆత్మకూరు సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్, ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్ పాల్గొని మాట్లాడుతూ, భారత జాతీయ జెండా దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు గోరుపెల్లి మల్లారెడ్డి , కోరే లక్ష్మణ్ ఉపాధ్యక్షులు పరకాల రాంబాబు లోడి బద్రి భూత అధ్యక్షులు లోడ్ వెంకటయ్య పొడుగు వెంకటేశం అంబోజు కృష్ణ మెట్టి కృష్ణారెడ్డి వినోద్ బిజెపి నాయకులు బండారు సత్యనారాయణ కొల్లోజు శోభన్ బాబు యాస శ్రీనివాస్ రెడ్డి ఎరుకల వాసుదేవ్ ఉప్పలయ్య గౌడ్ అంబోజ అంజయ్య బూడిది నరసింహ గజ్జెల్లి మధు గడ్డం స్వామి గుర్రం చైతన్య బీజేవైఎం నాయకులు పైల ప్రశాంత్ భాష బోయిన లింగయ్య బొజ్జ పవన్ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, యువత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రామాలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

◆ భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తేవాలి..

◆ విస్తా కాంప్లెక్సు ఖాళీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి..

◆ అధికారులతో కలిసి రామాలయ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన దేవస్థానంఈవో..



**భద్రాచలం ఆగస్టు 13 (జనంసాక్షి)**
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగా కొనసాగుతున్న నిర్మాణ పనులను దేవస్థానం ఈవో కే. దామోదర్ రావు గురువారం పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు కొన సాగించాలని అధికారులకు సూచించారు. ఆలయ పరిసరాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఈవో తెలిపారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. రామాలయంకు చెందిన వాణిజ్య సముదాయం విస్తా కాంప్లెక్సును త్వరగా వ్యాపారస్తులు ఖాళీ చేసేలా చూడాలని, దీని వలన పనులు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉందన్నారు. వ్యాపారులతో ఏమైనా సమస్యలుంటే సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులతో పేర్కొన్నారు. రామాలయం ఉత్తరం వైపు పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, నవంబరు నాటికే ఉత్తరద్వారం పూర్తి చేసే ఇచ్చేలా పనులు జరగాలని అన్నారు. ఎటువంటి జాప్యం జరగకుండా, నాణ్యత ప్రమాణాలు లోపించకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రవీందర్, ఏఈవో శ్రావణ్‌కుమార్, సీసీ అనిల్‌కుమార్, ఇంజినీరింగ్ సిబ్బంది, నిర్మాణ పనుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## మండల పరిషత్ అధికారి కే వెంకటయ్య

**తిరుమలగిరి (సాగర్) ఆగస్టు 13 ,(జనంసాక్షి):**
మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధికారి కె వెంకటయ్య తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ, మండల స్థాయిలోని 23 శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.మండల పరిధిలోని ప్రజలందరూ ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆయా గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల స్థాయి అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మండల పరిషత్ అధికారి వెంకటయ్య కోరారు.

## ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**కొండమల్లేపల్లి, ఆగస్టు 13 (జనంసాక్షి):**
ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యుఎస్పిసి తలపెట్టిన దశల వారి పోరాటంలో భాగంగా గురువారం కొండమల్లేపల్లి మండల తహసిల్దార్ కి టీఎస్ యూటీఎఫ్ కొండమల్లేపల్లి మండల శాఖ తరపున వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్ భాను ప్రకాష్ మాట్లాడుతూ పిఆర్సి నివేదికను తెప్పించుకొని వెంటనే పిఆర్సి ప్రకటించాలని పెండింగ్ లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను ప్రకటించాలని రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయిలను సత్వరమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు నరేందర్, ప్రధాన కార్యదర్శి చిన్న ముత్యాలు, ఉపాధ్యక్షులు దేవుల్లయ్య, శోభారాణి, టిడబ్ల్యూఎఫ్ కన్వీనర్ కోటయ్య, టిఎస్ యుటిఎఫ్ పూర్వ జిల్లా కార్యదర్శి పులిగిల్ల గోవర్ధన్ రావు, వివిధ సంఘాల బాధ్యులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో విద్యార్థులకు బూట్లు, క్రీడా దుస్తుల పంపిణీ

### చాడ జెడ్పీహెచ్ఎస్‌లో 144 మంది విద్యార్థులకు లబ్ధి

### దాతల ఔదార్యాన్ని కొనియాడిన సర్పంచ్ ఆకుల శ్రీనివాస్

**మోటకొండూరు, ఆగస్టు 13(జనం సాక్షి):-**
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. మోటకొండూరు మండలంలోని చాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 144 మంది విద్యార్థులకు దాతల సహకారంతో ఉచితంగా బూట్లు, క్రీడా దుస్తులు (స్పోర్ట్స్ యూనిఫాం), ఐడీ కార్డులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోర బాలగంగాధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై, దాతలతో కలిసి విద్యార్థులకు సామగ్రిని అందజేశారు.

**ఉదారత చాటుకున్న దాతలు...**
విద్యార్థులకు అవసరమైన సుమారు రూ. 70 వేల విలువైన బూట్లను దాతలు పబ్బతి భూపాల్ రెడ్డి, వారాల మురళీమోహన్ రెడ్డి, అనంతుల వెంకటరెడ్డి అందజేశారు. అలాగే మరో దాత అనంతుల సునీల్ రెడ్డి గత రెండేళ్లుగా విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తుండగా, సుదగాని ఫౌండేషన్ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్ గత మూడేళ్లుగా విద్యార్థులకు ఐడీ కార్డులను ఉచితంగా సమకూరుస్తూ తమ ఉదారతను చాటుకుంటున్నారు. ఈ సందర్భంగా దాతల సేవలను హెచ్‌ఎం, సర్పంచ్ మరియు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు దాతల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వక్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దాతలు సుదగాని హరిశంకర్ గౌడ్, పబ్బతి భూపాల్ రెడ్డి, వారాల మురళీమోహన్ రెడ్డి, అనంతుల సునీల్ రెడ్డి తల్లిదండ్రులు, ఉపసర్పంచ్ పెలిమెల్లి భూమయ్య, ఏఏపీసీ చైర్‌పర్సన్ మమత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కృష్ణవేణి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు జక్క యాదిరెడ్డి, నాయకులు సత్యం, వెంకన్న, అబ్రహం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదిపై హత్యాయత్నానికి నిరసనగా విధులు బహిష్కరణ



**కోదాడ టౌన్ ఆగస్టు 13 ( జనంసాక్షి );**
నాగర్‌కర్నూల్ కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్న వేమగోపాల్‌రావుపై ఈ నెల 11న జరిగిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తూ కోదాడ కోర్టులోని న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు మాట్లాడుతూ సమాజంలో న్యాయవాదులపై హత్యాయత్నాలు, దాడులు మరియు బెదిరింపులు రోజురోజుకూ పెరిగిపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాదులకు పూర్తి స్థాయి రక్షణ కల్పించేలా ప్రభుత్వం,పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు తీర్మానం చేసి సంబంధిత అధికారులకు పంపినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వేజెల్లా రంగారావు,రంజాన్ పాషా, సిలివేరు వెంకటేశ్వర్లు,కోడూరు వెంకటేశ్వర్లు, సీతారామరాజు, ఉయ్యాల నర్సయ్య, దావీదు, నాగరాజు,నవీన్,ఉస్సేన్,హేమలత,శిల్పా, సంధ్య,గోవర్ధన్,రియాజ్,తాటిమురళి,పెద్దబాబూ, వెంకటేశ్వర బాబు,తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# చేపూర్ గ్రామంలో వర్షాల కోసం వరుణ దేవునికి ప్రత్యేక పూజలు



**గుర్రంపోడు, ఆగస్టు 13, (జనంసాక్షి)**
వరుణ దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడిపంటలు చల్లగా ఉండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ గుర్రంపోడు మండల పరిధిలోని చేపూర్ గ్రామంలో దేవుళ్లకు నీళ్లు పోసే సాంప్రదాయ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, పెద్దలు మరియు గ్రామ సర్పంచ్ మారపాక ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో స్థానిక దైవాల సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి వేడుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు పడి చెరువులు, కుంటలు నిండాలని, గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమారుడు మారపాక నరేందర్, వార్డు సభ్యులు నడ్డి శంకర్, జానపాటి వెంకన్న, కిలారి రామలింగం, నడ్డి బిక్షం, బద్రి లింగయ్య, కుందూరు లింగస్వామి, మారపాక మహేందర్, పుట్టపాక రవి, కుందూరు వెంకటేష్, ముష్టిపల్లి యల్లయ్య, మరియు మహిళలు ఇద్దమ్మ, వెంకటమ్మ, జానమ్మ, నావిత, రమణ, లక్ష్మమ్మ, శంకరమ్మ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు,

## సునంద మిల్లును శాశ్వతంగా తొలగించాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్

### సునంద రైస్ మిల్లులో 22 కోట్ల ధాన్యం కుంభకోణం

**గరిడేపల్లి, ఆగస్టు 13 (జనంసాక్షి):**
గరిడేపల్లి మండల కేంద్రం అంబేద్కర్ నగర్ లోని సునంద రైస్ ఇండస్ట్రీస్ లో జరిగిన 22 కోట్ల రూపాయల ధాన్యం కుంభకోణాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం మిల్లు ముందు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొత్తపల్లి రవి మాట్లాడుతూ సునంద రైస్ మిల్లులో అవకతవకలు జరుగుతున్నాయని గతంలోనే కలెక్టర్, సివిల్ సప్లై, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఎమ్మార్వో, ఎంపీడీవో గ్రామసభ వేదికగా పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇటీవల విజిలెన్స్ సివిల్ సప్లైస్ అధికారులు నిర్వహించిన దాడిలో మిల్లులో 8000 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం మాయమైనట్లు వెలుగు చూసిందన్నారు. దీని విలువ సుమారు 22 కోట్ల రూపాయలు ఉంటుందని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి మిల్లు భాగస్వాములు అకౌంటెంట్ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు.నాణ్యత లేని తప్పుడు బియ్యంతో ప్రజల



ఆరోగ్యంతో చెలగాటమాడటమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారని ఆరోపించారు. ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన పత్రికా మిత్రులకు నిజాయితీగా విధులు నిర్వర్తించిన ప్రభుత్వ ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.ప్రభుత్వం ఏ కారణంతో నైనా ఈ మిల్లు కు మళ్ళీ అనుమతి ఇస్తే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జై భీమ్ కమిటీ ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రవి, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్ట వెంకటేష్, ఆలంపల్లి శేఖర్, బచ్చలకూరి నాగార్జున, మాజీ ఎంపీటీసీ నకిరేకంటి సువార్త సైదులు, మేడే కరుణమ్మ, నెమలి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం : యుటిఎఫ్

**ఎర్రుపాలెం, ఆగస్టు 13 (జనంసాక్షి) :** ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు గురువారం డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని అఖూ విధానాన్ని రద్దు చేయడం, ఖఖీఅ అమలు చేయడం తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్పీసీ) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాలుగు దశల పోరాట కార్యక్రమానికి పిలుపునిచ్చింది. మొదటి దశలో భాగంగా ఈనెల 7వ తేదీన అన్ని పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయడం జరిగింది. రెండవ దశ పోరాట కార్యక్రమంలో భాగంగా ఎర్రుపాలెం మండల తహసిల్దార్ ద్వారా ముఖ్యమంత్రి కి మెమోరాండం సమర్పించడం జరిగింది. అనంతరం యుఎస్పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు అను మోలు కోటేశ్వరరావు ముత్తయ్య మాట్లాడుతూ పిఆర్సి గడువు ముగిసి మూడు సంవత్సరాలైనా అమలు చేయడం లేదని, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆరు డి ఎలు పెండింగ్లో ఉన్నాయని, ఉపాధ్యాయ ఉద్యోగుల, పెన్షనర్ల కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయడం లేదని, హెల్త్ కార్డులు సక్రమంగా అమలు చేయకపోవడం, అశాస్త్రీయంగా ఉన్న 25 జీవో సవరించాలని, పర్యవేక్షకు పోస్టులు భర్తీ చేయాలని, కేజీబీవీ, మోడల్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనేక మార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంస్పందించి ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల ఈనెల 19వ తేదీన జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29వ తేదీన హైదరాబాదులో మహా ధర్నా నిర్వహించనున్నామని, అప్పటికి సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ మొదటి వారంలో చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యు ఎస్ పి సి కంచర్ల శ్రీనివాసరావు నుంద్రు వెంకటేశ్వరరావు భూషణ్ రాజ్ నీలం సైదారావు టి వెంకటకృష్ణ నరాల సాంబశివరెడ్డిసుధాకర్ ఎన్ జ్యోతి ధనలక్ష్మి రత్నకుమారి నరసింహారావు ఉపేంద్ర సతీష్ రవికుమార్ సుబ్బరామరాజు బాలకృష్ణ నిరంజన్ పుల్లారావు జి శ్రీనివాస్ శంకర్ రామకృష్ణ మురళి రిటైర్ ఉపాధ్యాయులు నీలం అజయ్ కుమార్ బందారుపల్లి రాజారావు మురళి తదితరులు పాల్గొన్నారు.





## విద్యను కాషాయీకరణ చేయాలని బీజేపీ చూస్తోంది

### - విద్యార్థి పోరాటాలకు ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది: వరక అజిత్

**భద్రాచలం ఆగస్టు 13 (జనంసాక్షి)** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యను కేంద్రీకరిస్తూ నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ ఆరోపించారు. ఈ విధానం ద్వారా కార్పొరేట్ విద్యకు మరింత ప్రోత్సాహం లభించి, పేద విద్యార్థులకు విద్య దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం శాస్త్రీయ ఆధారిత విద్యకు బదులుగా పురాణాలు, మూఢనమ్మకాల వైపు విద్యార్థులను నడిపించే విధంగా ఉందని విమర్శించారు. విద్యారంగంలో కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్ ఉద్యమాల్లో విద్యార్థులంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలి

**టీబీ రహిత గ్రామంగా 'మాటూరు'ను తీర్చిదిద్దుదాం**

**స్క్రీనింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ జన్న సిద్దులు**

**131 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ**



**మోటకొండూరు, ఆగస్టు 13(జనం సాక్షి):** క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో, కలిసికట్టుగా కృషి చేయాలని మాటూరు గ్రామ సర్పంచ్ జన్నె సిద్దులు పిలుపునిచ్చారు. మోటకొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) పరిధిలోని మాటూరు గ్రామపంచాయతీలో గురువారం జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా.. 'టీబీ ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల క్యాంపెయిన్'ను నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన టీబీ స్క్రీనింగ్ కేంద్రాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఈ ఉచిత వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని, మాటూరును టీబీ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు.

**విస్తృతంగా వైద్య పరీక్షలు..**

ఈ వైద్య శిబిరంలో మొత్తం 131 మంది అవుట్ పేషెంట్లకు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 72 మందికి ఎక్స్-రేలు తీయగా, 25 మందికి కళ్లె పరీక్షలు చేశారు. అలాగే ఇతరులకు మధుమేహం (షుగర్), రక్తపోటు (బీపీ) వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీ వైద్య సిబ్బంది ఎస్.టి.ఎస్ జ్యోతి, ఎస్.టి.ఎల్.ఎస్ నటేష్, ఎయిమ్స్ టెక్నీషియన్లతో పాటు స్థానిక ఆరోగ్య కార్యకర్తలు జయ, విజయరాణి, ఆశ కార్యకర్తలు జయమ్మ, సంతోష, రేణుక, మేఘమాల, మహేశ్వరి, భార్గవి,గ్రామ పంచాయతీ సెక్రటరీ సాయికుమార్, పారిశుద్ధ్య సిబ్బంది, గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## భద్రాచలం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు

# ఎమ్మెల్యే భరోసా

### - నిర్మాణ పనుల పూర్తికి రూ.50 లక్షల హామీ

**భద్రాచలం ఆగస్టు 13 (జనంసాక్షి)** భద్రాచలం పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ మిగిలిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హామీ ఇచ్చారు. గురువారం ఎస్సీ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావు హాల్ నిర్మాణానికి అవసరమైన మిగిలిన పనులను పూర్తి చేయించడంతో పాటు రూ.50 లక్షల నిధులు సమకూర్చేందుకు హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ పూర్తయితే ఎస్సీ వర్గాల ప్రజలకు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే హామీపై ఎస్సీ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగుంట శ్రీనివాస్, జెట్టి రాము, రాజబాబు, కృష్ణార్జున్ రావు, రమేష్, అలవాల రాజా తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

**- బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ.**



**భద్రాచలం ఆగస్టు 13 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేదింటి ఆడపిల్లల పెళ్లికి మేనమామలా అండగా నిలిచేలా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేశారని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రూ.లక్ష ఆర్థికసాయంతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల అమలుపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. హైకోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడంలోనే ప్రభుత్వం ఇంత జాప్యం చేయడం చూస్తుంటే పథకాన్ని పక్కన పెట్టే కుట్ర జరుగుతోందని వారు ఆరోపించారు. పథకాన్ని నిర్వీర్యం చేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెడ్డపేరు తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమైన ఈ పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలని వారు డిమాండ్ చేశారు. ప్రజలకు అన్యాయం చేసే ఇలాంటి చర్యలను ప్రజలు క్షమించరని, తగిన సమయంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజు వస్తుందని రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ హెచ్చరించారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా - ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు

**భద్రాచలం ఆగస్టు 13 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి, ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ భద్రాచలం నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యోగులు గురువారం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావును కలిశారు. భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలు చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ముఖ్యంగా ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలను అందించడంతో పాటు మేనిఫెస్టోలో ప్రకటించిన 250 గజాల స్థల హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు మాదిరి పుల్లారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో, మిగిలిన సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల నాయకులు మాదిరి పుల్లారావు, చాట్ల రవి, దాసరి శేఖర్, అనపల రాజు మాదిగ, ఎండీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

**చింతకాని, ఆగష్టు 13(జనం సాక్షి )**

తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యూఎస్‌పీసీ) పిలుపు మేరకు దశలవారీ ఆందోళనలో భాగంగా చింతకాని మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీని వెంటనే అమలు చేయడంతో పాటు ఆరు విడతల డీఏను మంజూరు చేయాలని, ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. విద్యారంగానికి ఇబ్బందికరంగా ఉన్న జీవో 25ను రద్దు చేసి, రేషనలైజేషన్ కారణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకుండా పోకుండా 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. 100 మందికి పైగా విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లో అవసరమైన కనీస వసతులు కల్పించి, సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. అలాగే సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలను రూపొందించి పదోన్నతులు కల్పించాలని, పర్యవేక్షణ అధికారులైన డిప్యూటీ డీఈవోలు, ఎంఈవో పోస్టులతో పాటు డైట్ లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నాయకులు కోరారు.

ఈ సందర్భంగా చింతకాని మండల ప్రధాన కార్యదర్శి తోటకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు జీడీఎస్‌వీ రమణ మాట్లాడుతూ దశలవారీ ఆందోళనలో భాగంగా మండలంలోని ఉపాధ్యాయులందరూ స్ఫూర్తివంతంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ఈ నెల 13న మండలంలో నిర్వహించే నిరసన, ధర్నా, వినతిపత్రం సమర్పణ కార్యక్రమాన్ని, 19న జిల్లా కేంద్రంలో చేపట్టే నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని కోరారు.



## ఉపాధ్యాయుల సమస్యలపై నిరసనలు కొనసాగుతాయి

### యు.ఎస్.పి.సి నాయకుల పిలుపు

**టేకులపల్లి,ఆగష్టు 13 (జనంసాక్షి):**

విద్యారంగం, ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులకు సంబంధిం చిన అపరిష్కృత సమస్యలను పరిష్కరించేంత వరకు నిరసన పోరాటాలు కొనసాగిస్తామని ఉపా ధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) నాయకులు పిలుపునిచ్చారు. యూఎస్పీసీ రెండో దశ పోరాట కార్యాచరణలో భాగంగా టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టి, తహసీల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యు.ఎస్.పి.సి సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల వ్యక్తిగత, ఆర్థిక సమస్యలు కూడా విద్యారంగ సమస్యలేనని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ప్రతినెల వందలాది మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్న నేపథ్యంలో ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాల లకు మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలల మూసివేత ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యలో అసమానతలను తొలగించి నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఉపాధ్యాయులను బోధనేతర పనులకు దూరంగా ఉంచి తరగతి గది బోధనకు పరిమితం చేయాలని కోరారు. మూడేళ్లు గడిచినా పీఆర్సీ అమలు చేయకపోవడం, కేంద్రం డీఏ ప్రకటించినప్పటికీ రాష్ట్రంలో ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటం, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగుల ఇతర బకాయిల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించా లని డిమాండ్ చేశారు. విద్యారంగం, పాఠశాలలు, ఉపాధ్యాయులకు సంబంధించిన సుమారు 29 సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న హైదరాబాద్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికీ సమస్య లు పరిష్కారం కాకపోతే వర్షాకాల అసెంబ్లీ సమావే శాల సందర్భంగా 'చలో అసెంబ్లీ' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్పిసి నాయకులు తేజావత్ లక్ష్మణ్, బి కిషోర్ సింగ్, జి హరిలాల్, బి రామరాజు, చందర్ సింగ్, శేషగిరి, రంగారావు,సమ్మయ్య, ఎస్.రవీందర్ , బి వెంకటేశ్వర్లు,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్ట్‌షాపుల తొలగింపు తీర్మానం ఏమైంది?

**- రెండు నెలలు గడిచినా అమలుకు నోచుకోని పంచాయతీ తీర్మానం..**

**- కాగితాలకే పరిమితమైందా? అధికారుల తీరుపై ప్రజల మండిపాటు.**




భద్రాచలం ఆగస్టు 13 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బెల్ట్‌షాపుల నియంత్రణ, తొలగింపుపై గ్రామపంచాయతీ చేసిన తీర్మానం ఏమైంది? తీర్మానం చేసి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అక్రమ మద్యం విక్రయాలపై ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

తీర్మానం చేసిన తొలినాళ్లలో అధికారులు హడావుడిగా కొన్ని చర్యలు చేపట్టినా.. ఆ తర్వాత ఎందుకు వెనక్కి తగ్గారన్న ప్రశ్నలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసినా దానిని అమలు చేయాల్సిన సంబంధిత శాఖలు పట్టించుకోకపోతే.. తీర్మానాల అవసరం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**- తీర్మానం చేసినా.. పరిస్థితి మారలేదే!**

బెల్ట్‌షాపుల తొలగింపుపై గ్రామపంచాయతీ తీర్మానం చేసినప్పుడు అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు ఆశించారు. కానీ రెండు నెలలు గడిచిన తర్వాత కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు బహిరంగంగానే కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తుండగా.. మరికొన్ని చోట్ల మద్యం విక్రయ కేంద్రాలు బార్‌షాపులను తలపించేలా నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదన్నదే ప్రజల ప్రధాన ప్రశ్నగా మారింది.

**- రెండో గ్రామసభలోనూ అదే ప్రశ్న.. సమాధానం ఏది?**

ఇటీవల నిర్వహించిన రెండో విడత గ్రామసభలోనూ బెల్ట్‌షాపుల అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. పంచాయతీ తీర్మానం అమలు పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తినా.. ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, ఇకపై చేపట్టబోయే కార్యాచరణపై స్పష్టత రాలేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో "తీర్మానం కేవలం కాగితాలకే పరిమితమైందా?" అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**- రామాలయ పరిసరాల్లో మద్యం విక్రయాలపై ఆగ్రహం.**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దర్శనానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఇలాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు రావడం భక్తులు, స్థానికులను కలవరపెడుతోంది. ఆలయ పరిసరాల్లో మద్యం విక్రయాలకు తావులేకుండా చేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా? అని రామభక్తులు ప్రశ్నిస్తున్నారు. భద్రాచలం ఆధ్యాత్మిక ప్రతిష్ఠకు భంగం కలిగించే కార్యకలాపాలపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**- చిన్న దుకాణాలపై దూకుడు.. బెల్ట్‌షాపులపై ఎందుకు మౌనం?**

చిన్నచిన్న వ్యాపారాలపై నిబంధనల పేరుతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, మరి అక్రమ మద్యం విక్రయాలపై అదే స్థాయిలో ఎందుకు స్పందించడం లేదని స్థానికులు నిలదీస్తున్నారు. పంచాయతీరాజ్, ఎక్సైజ్, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తే బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవడం పెద్ద కష్టమేమీ కాదని ప్రజలు అంటున్నారు. మరి చర్యలకు అడ్డంకి ఏమిటో అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు.

**- ఇకనైనా కార్యాచరణ ప్రకటిస్తారా?**

బెల్ట్‌షాపుల తొలగింపుపై గ్రామపంచాయతీ చేసిన తీర్మానానికి ఇప్పటివరకు ఏం చేశారు? ఎన్ని దుకాణాలపై చర్యలు తీసుకున్నారు? ఇంకా ఎన్ని కొనసాగుతున్నాయి? భవిష్యత్తులో ఏ చర్యలు చేపట్టనున్నారు? అనే వివరాలను సంబంధిత అధికారులు బహిరంగంగా వెల్లడించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తీర్మానాలు చేసి ఫైళ్లలో పెట్టడం కాదు.. క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పవిత్ర భద్రాచలం పట్టణానికి చెడ్డపేరు రాకుండా అక్రమ మద్యం విక్రయాలపై తక్షణమే ఉక్కుపాదం మోపాలని, పంచాయతీ తీర్మానాన్ని ఇకనైనా కార్యరూపంలోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎల్లమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కించిన అధికారులు..

కనగల్లు, ఆగస్టు 13 (జనం సాక్షి)

ధర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ ప్రాకార మండపంలో ధర్మకర్తల సమక్షంలో లెక్కించారు. 81 రోజులకు గాను 15 లక్షల 52 వేల 349 రూపాయల ఆదాయం భక్తుల నుంచి సమకూరినట్లు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కే భాస్కర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చీదేటి వెంకటరెడ్డి, ఆలయ కార్యనిర్వాహదికారి అంబటి నాగిరెడ్డి, ధర్వేశిపురం సర్పంచ్ రాయల శేఖర్, పర్వతగిరి సర్పంచ్ ఎం ముత్తయ్య, ధర్మకర్త లు, కే శంకర్ రెడ్డి, ఎం గణేష్ మోహన్, పి సత్యనారాయణ కే శ్రీను ఎన్ యాదగిరి జి సైదులు ఎన్ తిరుపతయ్య మహేష్ సిహెచ్ రమేష్ ఎన్ వెంకటేశ్వర్లు వెంకన్న పరమేష్ సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ లుకే ఉపేందర్ రెడ్డి, రాజ య్య, జె. నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు నాగోజుమల్లాచారి అర్చకులు, జి దామోదర్ రావు, సిబ్బంది వెంకటయ్య, శ్రీకర్, రాజు శ్రీ సాయి ట్రస్టు సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



## నలుగురు పిల్లలకు తల్లి దూరం విషాదంలో కుటుంబం

**నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు12,(జనం సాక్షి):**



నల్గొండ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విషాద ఘటన చోటుచేసుకుంది. మునుగోడు మండలం చీకటిమామిడికి చెందిన మమత (27) ఆసుపత్రి ప్రాంగణంలో ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందింది. మమత ప్రసవం కోసం ఎనిమిది రోజుల క్రితం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఇప్పటికే ముగ్గురు ఆడపిల్లలు ఉండగా,ఇటీవల మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బుధవారం తెల్లవారుజామున వార్డు నుంచి బయటకు వచ్చిన మమత, పోస్టుమార్టం గది సమీపంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మమత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మమత ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

**విషాదంలో ఆ కుటుంబం:**

మమత దంపతులు బాబు కోసం ఎదురుచూస్తూ ముగ్గురు ఆడపిల్ల ను కన్నారు చివరకు 7 రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయ్యి పండంటి బాబు కి జన్మనిచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గత 7 రోజుల నుండి నిద్ర రావడం లేదు అని దగ్గు కూడా ఎక్కువగా వస్తుంది అని డాక్టర్లు కి తెలిపిన ఎం కాదు అని తెలిపినట్లు టెస్టులు చేసిన అంత మంచిగానే ఉంది అని డాక్టర్లు తెలిపినట్లు చెప్పారు. మమత గత మూడు రోజుల నుండి నేను చచ్చిపోయేలా ఉన్న అని కుటుంబ సభ్యులకు ఆమె తెలిపినట్లు తెలిపారు. మొత్తానికి పసి బాబు పాల కోసం ఏడుస్తున్న తీరు అక్కడి వారిని కలిచివేస్తుంది మార్చురీ పరిసరాలు మొత్తం కూడా విషాదఛాయలు అలుముకున్నాయి.

# మహిళలు, చిన్నారుల భద్రతపై పోలీసుల అవగాహన సదస్సు

**◆గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించిన ఎస్ఐ కుమారస్వామి యాదవ్**

**◆కాటేపల్లి ప్రాథమిక పాఠశాలలో విజయవంతంగా కార్యక్రమం**

**◆పోక్సో చట్టం, సైబర్ నేరాలు, గృహహింసపై విపులమైన వివరణ**



**మోటకొండూరు, ఆగష్టు 13(జనం సాక్షి):-.** మహిళలు, చిన్నారుల రక్షణే ధ్యేయంగా కాటేపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మోటకొండూరు ఎస్ఐ బి. కుమారస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని చట్టాలపై ప్రజలకు, మహిళలకు విశేష అవగాహన కల్పించారు. చట్టాలపై ప్రజలకు సరైన అవగాహన ఉంటే నేరాలను సులభంగా అరికట్టవచ్చని ఎస్ఐ ఈ సందర్భంగా వివరించారు.

**నేరాలపై అవగాహన - అప్రమత్తతే ఆయుధం...**

ఈ సదస్సులో ఎస్ఐ కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ.. ప్రధానంగా చిన్నారులు, బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు కఠినమైన 'పోక్సో చట్టం ఉందని, దీనిపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. అలాగే పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే వేధింపులు, ఇళ్లలో ఎదుర్కొంటున్న గృహ హింస (498ఏ చట్టం తదితర అంశాలు), చైన్ స్నాచింగ్ (బంగారు గొలుసుల చోరీ), ఆస్తి సంబంధిత నేరాల పట్ల ప్రతి ఒక్కరూ ఎలా అప్రమత్తంగా ఉండాలో సూచించారు.ప్రస్తుత రోజుల్లో అత్యంత వేగంగా పెరుగుతున్న 'సైబర్ నేరాల' గురించి వివరిస్తూ.. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, మెసేజ్ లింక్స్ పట్ల జాగ్రత్తగా ఉంటూ సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దని హెచ్చరించారు.

ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించి రక్షణ పొందాలని ఎస్ఐ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

**మునుగోడు జనం సాక్షి (ఆగస్టు 13)**

దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాలుగు దశల పోరాట కార్యక్రమానికి పిలుపునిచ్చింది.మొదటి దశలో భాగంగా ఈ నెల 7వ తేదీన మునుగోడు మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రెండవ దశ పోరాట కార్యక్రమంలో భాగంగా మునుగోడు మండల తహసిల్దార్ నరేష్ గారి ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి ఈ రోజు యూఎస్పీసీ నాయకులు మెమోరాండం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా యూఎస్పీసీ నాయకులు కె.రత్నయ్య, గేర నరసింహ, నలపరాజు వెంకన్న, మాట్లాడుతూ పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు గడిచిన నూతన పీఆర్సీని అమలు చేయడం లేదన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆరు డీ.ఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధ్యాయ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయడం లేదన్నారు. హెల్త్ కార్డులను సక్రమంగా అమలు చేయాలని, అశాస్త్రీయంగా ఉన్న 25 జీవోను సవరించాలని, పర్యవేక్షక పోస్టులను భర్తీ చేయాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అనేకమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.లేనిపక్షంలో ఈ నెల 19వ తేదీన జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29వ తేదీన హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని, అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ మొదటి వారంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని యూఎస్పీసీ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ మునుగోడు మండల నాయకులు బి. రాములు, ఎం. నటరాజు, ఎస్. లింగయ్య మరియు కల్లూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్పీ నల్గొండ పార్లమెంట్ ఇంచార్జ్‌గా నల్ల ప్రసాద్

### అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం



**చింతపల్లి, ఆగష్టు 13(జనంసాక్షి)** చింతపల్లి గ్రామానికి చెందిన నల్ల ప్రసాద్ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నల్గొండ పార్లమెంట్ ఇంచార్జ్‌గా ఎన్నికైన సందర్భంగా ఎంఆర్పీఎస్, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు.ఈ నెల 09వ తేదీన ఆదివారం నల్గొండలో జరిగిన బీఎస్పీ జిల్లా సమీక్షా సమావేశంలో నల్ల ప్రసాద్‌ను నల్గొండ పార్లమెంట్ ఇంచార్జ్‌గా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు ఎర్ర జగన్, ఎంఆర్పీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మేటి వెంకటరమణ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు చెన్నయ్య, మాజీ చింతపల్లి అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఎర్ర వెంకటయ్య, సమాచార ప్రచార సమితి అధ్యక్షులు ఏనుగుల వెంకటయ్య, రాములు, నల్ల ఆంజనేయులు, మొగులయ్య, సురేష్, శ్రీను, కుమార్, జగన్, నాగయ్య, కళ్యాణ్, యాదగిరి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు...

# వరి వేసుకోకండి..నష్టపోకండి- కలెక్టర్ బి. చంద్రశేఖర్



ఈ ఖరీఫ్ సీజన్ సమయం ముగిసినందున జిల్లాలోని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేయవద్దని, వరి వేస్తే నష్టపోవాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. వ్యవసాయ అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో ప్రతి రైతు పొలం వద్దకు వెళ్లి రైతులు వరి వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. వరి పంట వేసేందుకు పెట్టే పెట్టుబడి, నీటి లభ్యత, వర్షాలు, భూగర్భ జలాలు, కూలీల పెట్టుబడి అన్నింటిని రైతులకు వివరించి చెప్పి వరి పంట జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, తిప్పర్తి మండల కేంద్రం శివారులో వరి సాగుకు భూములు సిద్ధం చేసుకుంటున్న రైతులు మోహన్, పరశు రాం, ఖాదర్ తదితరులతో మాట్లాడారు. వరి పంటకు సాగునీటి అవకాశాలే లేవని, అలాంటప్పుడు వరి ఎందుకు వేస్తున్నారని జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. బలవంతంగా వరి సాగు చేస్తే నష్ట పోవలసి వస్తుందని రైతులతో చెప్పారు. ఆరతడి పంటలు వేసుకుంటే నష్టం లేకుండా, ఆదాయం వస్తుందని తెలియజేస్తూ ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు.ఎల్ నినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం వర్షాలు కురిసే అవకాశం లేదని, వచ్చే ఖరీఫ్ సీజన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేనందున ప్రస్తుతం వరి వేసుకునేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవని, అంతేకాక ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు వచ్చే అవకాశం లేదని, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు రాదని, వర్షం లేకపోవడం, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీరు తగ్గిపోయిందని తెలిపారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి పంట వేసుకోవద్దని, అనవసరంగా ఇబ్బందులు పడవద్దని అన్నారు. వరి పంట వేసుకున్నట్లయితే మధ్యలోనే పంట ఎండిపోతుందని, ఇదివరకే చాలా చోట్ల బోర్లలో తక్కువ నీరు వస్తున్నదని,వరి పైన పెట్టిన పెట్టుబడి కూడా రైతుకు గిట్టుబాటు కాదని ,వరి పంట స్థానంలో ఆరుతడి పంటలు వేసుకోవాలని, సెప్టెంబర్ చివరివరకే ఆరుతడి పంటలు వేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రం శివారులో చౌడు భూముల్లో రైతులు వరి పంటకు సిద్ధం చేయడాన్ని గమనించిన కలెక్టర్ చౌడు భూముల్లో మినుములు, పెసర వంటి పంటలు వేసుకోవాలని, మినుము, పెసర పంటలకు పెట్టుబడి తక్కువని, ఎకరాకు 8000 చొప్పున ఆదాయం వస్తుందని, అదే వరి పంటకు పెట్టుబడి ఎక్కువని, పొరపాటున నీళ్లు లేక, వర్షం రాక పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతు అప్పుల పాలు కావాల్సి వస్తుందని అన్నారు. చవుడు భూములలో జిప్సం వేసుకున్నట్లయితే మినుము, పెసర పంటల లాంటివి సులభంగా తీసుకోవచ్చని, అంతేకాక చౌడు నెలల్లో రేగు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు కూడా వేసుకునేందుకు అవకాశం ఉందని, ఈ దిశగా రైతులు ఆలోచించి ఆరుతడి పంటలు ,ఉద్యాన పంటలు వేసుకునేలా చూడాల్సిందిగా ఆయన వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అధికారులు వారి పరిధిలోని ప్రతి రైతు ను ప్రత్యక్షంగా కలిసి పంట వివరాలను తెలుసుకొని వరి పంట సాగు చేయవద్దని, వరి పంట సాగు చేయడం వల్ల కలిగే నష్టాలను లెక్కలతో సహా వివరించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. రైతులు యూరియా గురించి జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ అన్ని షాపులలో యూరియా దొరికే విధంగా అవకాశం కల్పించాలని, యాప్ ద్వారా యూరియా బుక్ చేయడం వల్ల వెంటనే స్టాకు అయిపోతున్నదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ యూరియా ఇండెంట్ పంపాల్సిందిగా జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ ను ఆదేశించారు.వ్యవసాయ సహాయ సంచాలకులు విజయేందర్ రెడ్డి, సన్నీ రాజ్, గిరిరాజు ,ఏవో శ్రీనివాస్, ఏ ఈ ఓ సంతోషి, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



# పీ.ఏ.పల్లి మండల అభివృద్ధికి శాఖల వారీగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలి

## ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**పి.ఏ.పల్లి,ఆగష్టు 13(జనంసాక్షి )**
పి.ఏ.పల్లి మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు,ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధికి శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని,నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.గ్రామాల్లో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించడమే అధికారుల ప్రాధాన్యత కావాలని అన్నారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సాగు సలహాలు, విత్తనాలు, ఎరువులు, పంటల రక్షణకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో అందించాలని, రైతుల ఆదాయం పెంచే ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించాలని సూచించారు.రెవెన్యూ శాఖ పరిధిలోని భూ సమస్యలు, ఫారెస్ట్ శాఖకు సంబంధించిన భూసమస్యలు, ధ్రువీకరణ పత్రాలు, ప్రజలకు సంబంధించిన ఇతర రెవెన్యూ సేవలను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే తెలిపారు.ప్రజలు చిన్నచిన్న పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని అన్నారు. పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు, ప్రభుత్వ భవనాలు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని అన్నారు.

వి బి జి ఆర్ ఏ ఎం జి ద్వారా గ్రామీణ కూలీలకు పని కల్పించడంతో పాటు, ద్వారా గ్రామపంచాయతీ భవనాలు అంగన్వాడి కేంద్రాలు వాటి వద్ద మరుగుదొడ్ల నిర్మాణాలు ఏర్పాటు చేయాలి. గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే నీటి సంరక్షణ, చెరువులు, కాలువలు, మొక్కల పెంపకం వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు.

విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వైద్య–ఆరోగ్య శాఖ ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్యం మరింత చేరువ కావాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. గర్భిణీలు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

మిషన్ భగీరథ, విద్యుత్ శాఖల గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.పౌరసరఫరాలు, సంక్షేమ, మహిళా–శిశు సంక్షేమ శాఖలు అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క లబ్ధిదారుడు కూడా ప్రభుత్వ పథకాల నుంచి దూరం కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని అన్నారు.

పశుసంవర్ధక, ఉద్యానవన, మత్స్య, మార్కెటింగ్ శాఖల అధికారులు రైతులు, గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయ మార్గాలను అందించే పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకురావాలని, ఆ దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు.పీఏ పల్లి మండలంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, పారిశుధ్యం, కరెంటు వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ మండలాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ యొక్క సమీక్ష సమావేశంలో ఎంపీడీవో చంద్రమౌళి,తహసీల్దార్ జయశ్రీ ,మండల ప్రత్యేక అధికారి శశికళ,పీఏసీఎస్ చైర్మన్ తేర మణిపాల్ రెడ్డి,గ్రామ కార్యదర్శిలు,సర్పంచులు,పాల్గొన్నారు.



## మహిళా క్రీడాకారులకు క్రీడా దుస్తుల పంపిణీ చేసిన సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్

**ఆత్మకూర్ ఎం జనంసాక్షి**
ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మహిళల త్రోబాల్ పోటీలకు యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఎంపికైన ఆత్మకూర్ గ్రామానికి చెందిన మహిళా క్రీడాకారులకు గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు.

## నేరుగా విత్తే వరి సాగుపై అవగాహన కార్యక్రమం



**పెన్ పహాడ్, ఆగష్టు 13 (జనం సాక్షి) :**
మండల పరిధిలోని దూపహాడ్ గ్రామ రైతు వేదికలో నేరుగా విత్తే వరి సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన కే వి కే సస్యరక్షణ శాస్త్రవేత్త డి ఆదర్శ్, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగు లో నేరుగా విత్తే విధంగా, కలుపు యాజమాన్యం పై అవగాహన కల్పించారు. వివిధ రకాల కలుపు మొక్కలను సరైన సమయంలో గమనించి మందులు పిచికారి చేసినట్లయితే వాటిని సమర్థ వంతంగా నివారించుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భారత వరి పరిశోధన స్థానం, రాజేంద్రనగర్ ప్రాజెక్టు ఇంచార్జి కవిరాజ్ మాట్లాడుతూ నేరుగా విత్తే వరి సాగు వలన రైతులకు కలిగే లాభాలు, సమగ్ర నీటి యాజమాన్యం, పురుగు, తెగుళ్ల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎస్బీఐ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ అర్పిత శర్మ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా రైతులు ఏ విధంగా లాభం పొందారో, అధిక దిగుబడులు రావడానికి వారికి ఇంకా ఇతర ఉత్పత్తులు ఏమి కావాలో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ ప్రాజెక్టులో భాగంగా నేరుగా విత్తే వరి సాగు చేసే రైతులకు షూస్ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, ఏఈఓ ప్రియాంక, రైతులు దొంగరి అరవింద్, అశోక్, నాగరాజు, సైదులు, వీరయ్య ఇతరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం నుంచి అక్రమంగా తరలిస్తున్న కృష్ణా జలాలను అడ్డుకోవాలి:నోముల భగత్ కుమార్



**హాలియా, ఆగస్టు 13 జనం సాక్షి:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు ప్రధాన నియంత్రణ ద్వారా కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తున్నప్పటికీ, అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నోముల భగత్ కుమార్ ఆరోపించారు. హాలియా పట్టణంలో నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకవైపు కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరలించుకుపోతుంటే, మరోవైపు రైతు సంక్షేమం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాగార్జునసాగర్‌లో వరుణ యాగం నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు.

కృష్ణా నదిలో మిగులు జలాలను మాత్రమే పోతిరెడ్డిపాడు ప్రధాన నియంత్రణ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినియోగించుకోవాలని, నికర జలాల నుంచి నీటిని తరలించుకునే హక్కు లేదని ఆయన అన్నారు.పోతిరెడ్డిపాడు ప్రధాన నియంత్రణ ద్వారా రోజుకు ఆరు టీఎంసీల వరకు కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరలించుకుపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయిలో నిండకముందే నీటిని తరలించుకుపోతే భవిష్యత్తులో నాగార్జునసాగర్ జలాశయం నిండే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు.శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి నీటిని తీసుకురాకపోతే భవిష్యత్తులో నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద ఉన్న ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.వరుణ యాగాల పేరుతో రైతులను మభ్యపెట్టడం మానుకుని, శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేసి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులకు ఈ ప్రాంత రైతుల పట్ల, అభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే శ్రీశైలం జలాశయానికి వెళ్లి పోతిరెడ్డిపాడు ప్రధాన నియంత్రణ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరలిస్తున్న కృష్ణా జలాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి కృష్ణా జలాల తరలింపును అడ్డుకోకపోతే భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నోముల భగత్ కుమార్ హెచ్చరించారు.

ఈ విలేకరుల సమావేశంలో కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, వడ్డే సతీష్ రెడ్డి, నల్గొండ సుధాకర్, వర్ర వెంకట్ రెడ్డి, కడమంచి శ్రీను, సురబి రాంబాబు, ఊర్లగొండ వెంకటయ్య, చిట్టీపోలు శ్రీనివాస్, చేగొండి కృష్ణ, కూరాకుల రవి యాదవ్, సైదా చారి, యడవెల్లి నాగరాజు, కార్తీక్, మల్లికార్జున్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## మండలంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించిన భక్తులు**

**అంగరంగ వైభవంగా అమ్మవారి వేడుకలు**

**మాదుగులపల్లి ఆగస్టు (13 జనం సాక్షి ):**
మాదుగులపల్లి మండలంలో బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శ్రీ ముత్యాలమ్మ తల్లికి భక్తులు శ్రద్ధాభక్తులతో బోనాలు సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.మండల కేంద్రంలో స్థానిక దర్శనం సోదరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఐక్యంగా, ఆనందోత్సాహాల నడుమ అమ్మవారికి నైవేద్యంగా బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా దర్శనం సోదరులు మాట్లాడుతూ ఏటా సాంప్రదాయబద్ధంగా కుటుంబమంతా ఒక్కటై కలిసికట్టుగా అమ్మవారి వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు మండల ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించి, ఊరంతా సుఖసంతోషాలతో విలసిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో సైతం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి దర్శించుకున్నారు గ్రామాలు ఆధ్యాత్మిక శోభతో విలసిల్లాయి ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, బంధుమిత్రులు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మాదుగులపల్లి సర్పంచ్ అర్రూరి నరేష్, గంధ్రవానిగూడెం సర్పంచ్ బొబ్బలి కావ్య శ్రీనివాస్, ఉప సర్పంచ్ వెంకన్న, దర్శనం బ్రదర్స్ పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.




## వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**హాలియా, ఆగష్టు 13 జనంసాక్షి:**
తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్ హాలియా పురపాలక సంఘం పరిధిలోని 5వ వార్డులో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అభివృద్ధి, భక్తులకు అందుతున్న సౌకర్యాలు, ఇతర వసతులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆలయ పూజారులు కమిషన్ చైర్మన్, సభ్యులకు ఆలయ ప్రసాదాన్ని అందించి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో హాలియా పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు గౌని రాజా రమేష్, 5వ వార్డు కౌన్సిలర్ సలహాదారు చిట్టీపోలు కరుణాసాగర్, 2వ వార్డు కౌన్సిలర్ సలహాదారు నకరికంటి సైదులు, 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల యేసురాజు, 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, 12వ వార్డు కౌన్సిలర్ సలహాదారు ఎడవల్లి రంజిత్, పురపాలక అధికారులు, సిబ్బంది, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చర్ల స్కూల్‌లో ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌కు ప్రభుత్వ ఉపాధ్యాయుడు వేధింపులు

- ◆జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసిన బాధిత యువతి
- ◆అదే స్కూల్లో సొంత ఊరికి చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు దౌర్జన్యం
- ◆వేధింపులకు గురి అవుతున్న యువతి పిల్లలకు విద్య బుద్ధులు నేర్పే
- ◆ఉపాధ్యాయుడుడి నిశ్చయ మైన బుద్ధి చూపారు
- ◆మహిళల ఉపాధ్యాయురాలుపై ఆగడాలకు అడ్డుకట్ట ఉందా? లేనట్టా?
- ◆సభ్య సమాజం ఎటు పోతుంది
- ◆ఉపాధ్యాయులుఇలా ఉంటే మహిళలకు రక్షణ ఏది..?
- ◆ జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే..?

**కామేపల్లి,ఆగస్టు 13 (జనంసాక్షి):**
కామేపల్లి మండల పరిధిలోని ముచ్చర్ల ఎంపీపీ ఎస్ స్కూల్‌లో ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న యువతి పై అదే పాఠశాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆమడల ప్రసాద్ వేధింపులకు పాల్పడుతున్నట్లు బాధిత యువతి ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి కు ఫిర్యాదు చేసింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన భార్యకు ఉద్యోగం ఇప్పించాలనే ఉద్దేశంతో ఈ యువతి పై అనుచిత వాక్యాలు వేధింపులకు గురి చేస్తూ. తన విధులకు ఆటంకం కలిగిస్తూ తరగతి గదిలోకి వచ్చి సెల్ ఫోన్‌తో ఫోటోలు, వీడియోలు తీస్తూ ఆమెను బెదిరిస్తున్నారని బాధిత ఇన్‌స్ట్రక్టర్ డీఈఓకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పిల్లల తల్లిదండ్రులతో తనపై తప్పుడు ప్రచారం చేయిస్తూ, తను తీసుకొచ్చిన పిల్లలను తన తరగతి గది నుండి బలవంతంగా మొదటి తరగతి గదుల్లోకి మారుస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా జరుగుతున్న ఈ వేధింపుల వల్ల తన విధులు నిర్వహించడం కష్టంగా మారిందని ఆమె ఆ ఫిర్యాదులో వాపోయారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి



తనకు న్యాయం చేయాలని తన విధులకు రక్షణ కల్పించాలని ఆమె జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు.



సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రిలో నిర్వహించిన శ్రీముత్యాలమ్మ తల్లి బోనాల పండుగకు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్..

# గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

పి.ఏ.పల్లి,ఆగష్టు 13(జనంసాక్షి)
పి.ఏ.పల్లి మండలం తిరుమలగిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యాలయం అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందుతాయని అన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు కేవలం పరిపాలనా కేంద్రాలుగా కాకుండా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే వేదికలుగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామ అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు,



గ్రామస్థులు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తిరుమలగిరి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే బాలు నాయక్ హామీ ఇచ్చారు. అలాగే ఈ గ్రామంలోని రైతుల వ్యవసాయ భూసమస్యలను సంబందింత అధికారులతో మీ పట్టాలు పటిష్టంగా ఉండేలా నాదే భాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ బెల్లి కృష్ణవేణి ఆంజనేయులు,మండల అధ్యక్షుడు నెర్మటి సతీష్ రెడ్డి,కుక్కల గోవర్ధన్ రెడ్డి, వీరబోయిన ఎల్లయ్య యాదవ్,ఏ.వి.రెడ్డి, పాల్వాయి వెంకట్ రెడ్డి,ముచర్ల శ్రీకాంత్ యాదవ్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మండల పరిధి సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# స్నేహితురాలికి అండగా నిలిచిన ఎస్ఎస్‌సీ బ్యాచ్ స్నేహితులు

**మోత్కూర్ ఆగస్టు 13 (జనం సాక్షి)**
భర్తను కోల్పోయిన స్నేహితురాలికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. మోత్కూర్ హైస్కూల్ 2002?03 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన బొడ్డుపల్లి రజిత భర్త సంతోష్‌కుమార్ ఇటీవల మృతి చెందడంతో గురువారం ఆమె కుటుంబాన్ని స్నేహితులు పరామర్శించారు. రజిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎస్ఎస్‌సీ బ్యాచ్ స్నేహితులు తమవంతు సహాయంగా రూ.లక్ష సేకరించారు. గురువారం రజిత కుటుంబ సభ్యులకు ఆ మొత్తాన్ని అందజేసి, భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో స్నేహితురాలికి తోటి స్నేహితులు ఆర్థిక సహాయం అందించడం పలువురి ప్రశంసలు అందుకుంది.
ఈ కార్యక్రమంలో ముశం ఉపేంద్ర, చింతల హేమలత, బత్తిని విజయ, బొడ్డుపల్లి గీత, జినుకల సంగీత, ఎండీ. కమురున్నిసా, బద్దం మహేశ్వరి, ఎరసానిపల్లి జయలక్ష్మి, అవిశెట్టి యాదగిరి, కూరెళ్ల కృష్ణ, తేరాల కృష్ణ, ఓర్సు గోపాల్, బోయిని వెంకటేష్, బుశిపాక బందయ్య, గనగాని మహేష్, పానగంటి సంతోష్, కూసంపల్లి శ్రీను, చింత నర్సింహ, కట్టెకోల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా పేరుతో అదనపు వసూళ్లు.. రైతులకు తప్పని దోపిడీ

- ◆రూ.266 బస్తాకు రూ.300 వసూలు.. ట్రాన్స్‌పోర్టు పేరుతో కొత్త దందా
- ◆డిమాండ్‌ను ఆసరాగా చేసుకుంటున్నారా?.. ప్రేక్షకపాత్రలో వ్యవసాయ శాఖ
- ◆రైతుల ఇబ్బందులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

**మద్దిగూడ, ఆగస్టు 13 (జనంసాక్షి)**
యూరియా కొరత, పెరిగిన డిమాండ్‌ను కొందరు వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్న ఆరోపణలు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వ ధర ప్రకారం యూరియా బస్తా రూ.266కు విక్రయించాల్సి ఉండగా, మద్దిగూడ మండలం శివన్నగూడెంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో బస్తాకు రూ.300 చొప్పున వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అదనంగా వసూలు చేస్తున్న రూ.34ను ట్రాన్స్‌పోర్టు ఖర్చు పేరుతో తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇటీవల తమ్మడపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు ఫెర్టిలైజర్ యాప్‌లో యూరియాను బుక్ చేసుకున్నాడు. గురువారం శివన్న గూడెంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి వెళ్లి యూరియా తీసుకునే సమయంలో బస్తాకు రూ.300 చెల్లించాలని షాపు నిర్వాహకుడు రమేష్ కోరినట్లు రైతు తెలిపాడు. ప్రభుత్వ ధర రూ.266 ఉండగా అదనంగా ఎందుకు చెల్లించాలని ప్రశ్నించగా, మండలంలోని అన్ని దుకాణాల్లో రూ.300కే విక్రయిస్తున్నామని, తీసుకోవాలంటే తీసుకోవాలని, లేకపోతే లేదని సమాధానం ఇచ్చినట్లు రైతు ఆరోపించాడు.


**ట్రాన్స్‌పోర్టు పేరుతో వసూలు న్యాయమేనా?**
యూరియా సరఫరాకు సంబంధించి రైతుల నుంచి అదనంగా ట్రాన్స్‌పోర్టు చార్జీలను వసూలు చేసేందుకు సంబంధిత శాఖ నుంచి స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నాయా? ఉంటే వాటిని రైతులకు ఎందుకు వెల్లడించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ధర ఒకటిగా ఉండగా, దుకాణాల్లో మరో ధరకు విక్రయిస్తే ధరల నియంత్రణ వ్యవస్థ ఏం చేస్తోందని రైతులు ప్రశ్నిస్తున్నారు.

**పంటకు అవసరం.. అందుకే తప్పనిసరి కొనుగోలు**
ప్రస్తుతం పంటలకు యూరియా అత్యవసరంగా మారడంతో రైతులు దుకాణదారులు చెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. బస్తాకు రూ.34 అదనంగా చెల్లించడం చిన్న మొత్తం కాదని, ఎకరాల కొద్దీ పంట సాగు చేసే రైతులకు ఇది అదనపు ఆర్థిక భారంగా మారుతోందని అంటున్నారు.

**వ్యవసాయ శాఖ ఏం చేస్తోంది?**
మండలంలో యూరియా విక్రయాలపై వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ, రైతుల నుంచి అదనపు వసూళ్ల ఆరోపణలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎరువుల దుకాణాల్లో ధరల పట్టికలు, స్టాక్ వివరాలు, బిల్లుల జారీ తదితర అంశాలను తనిఖీ చేసి అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.

**కలెక్టర్ స్పందించాలి**
ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే యూరియా విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ట్రాన్స్‌పోర్టు పేరుతో అదనపు వసూళ్లకు అనుమతి ఉందా? ఉంటే ఎంత వసూలు చేయాలి? అనే విషయాలను అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అధిక ధరలకు విక్రయాలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




రైతుల చెమటతో పండే పంటకు అవసరమైన ఎరువుల విషయంలోనూ అదనపు భారం మోపితే రైతు ఎలా తట్టుకోగలడని ప్రశ్నిస్తున్నారు. యూరియా సరఫరాలో పారదర్శకత తీసుకురావడంతో పాటు, ప్రభుత్వ ధరకు రైతులకు ఎరువులు అందేలా జిల్లా ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

## కుమ్మరోళ్ళను గ్రామదేవతల ఆలయాల వద్ద పూజారులుగా నియమించాలి



తుంగతుర్తి, ఆగస్టు 13,(జనం సాక్షి)

గ్రామ దేవతల ఆలయాల వద్ద కుమ్మరోళ్ళను పూజారులుగా నియమించి వారికి ప్రభుత్వం తరపున నెలకు రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని మార్కండేయ భవనంలో తుంగతుర్తి మండలం లోని 16 గ్రామాల ప్రతినిధుల సర్వసభ్య సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడి కూడ జయంత రావు నాయకత్వంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ మరియు రాష్ట్ర కమిటీ సూచనల మేరకు జిల్లా కన్వీనర్ చలిగంటి వెంకటేష్ సమక్షంలో నియోజకవర్గ ఇన్చార్జి కోటమర్తి శ్రీనివాస్ అధ్యక్షతన 16 గ్రామాల కమిటీల తోపాటు యువజన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. తుంగతుర్తి మండల అధ్యక్షునిగా మద్దికుంట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, యూత్ అధ్యక్షునిగా మద్దికుంట్ల రవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ... గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారని తెలిపారు. గ్రామ దేవతల ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించే బాధితులను కుమ్మరోళ్ళ కు కల్పించడం ద్వారా సామాజిక సమానత్వాన్ని మరింత బలోపేతం చేయవచ్చు అన్నారు. దీనివల్ల ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కొంత ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు ఆలయ వ్యవస్థలను సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వీరేంద్ర, కోదాడ ఇన్చార్జి రామారావు, ఖమ్మంపాటి మధుసూదన్, నాగయ్య, లింగయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

చింతపల్లి, ఆగస్టు 13(జనంసాక్షి)

చింతపల్లి మండల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచించారు. చింతపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల వారీగా ప్రజల సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించడంతో పాటు భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలలు, వైద్య సేవలను మెరుగుపరచాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు-సంజీవరెడ్డి, డీఎల్పీవో, ఎంపీడీవో, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు...



# తిరంగా యాత్రను విజయవంతం చేయాలి

### - బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్

హుజూర్‌నగర్, ఆగస్టు 13 (జనంసాక్షి):

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నేడు హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న తిరంగా యాత్రను విజయవంతం చేయాలని హుజూర్ నగర్ బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, జాతీయ సమైక్యత, దేశభక్తి భావాలను ప్రజల్లో మరింతగా పెంపొందించేందుకు తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని బిజెపి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, దేశభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. జాతీయ జెండా మన దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ చేతిలో జాతీయ పతాకాన్ని పట్టుకుని తిరంగా యాత్ర లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. హుజూర్‌నగర్ పట్టణం మొత్తం త్రివర్ణ పతాకాలతో కళకళలాడేలా చేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు మాదుగుల లక్ష్మీనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు రాళ్ళబండి రామారావు, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

సూర్యాపేట(జనంసాక్షి):

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రిలో రూ.36 లక్షల వ్యయంతో ఓఅండ్ఎం నిధుల ద్వారా నిర్మించిన డబుల్ లైన్ బ్రిడ్జి రోడ్డును ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ గురువారం ప్రారంభించారు. అనంతరం రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలమర్రి అభివృద్ధే లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు.అన్ని వార్డుల్లో ప్రజలకు మెరుగైన రహదారులు, అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోడి నాగరాజు, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ల రమేష్, మున్సిపల్ కౌన్సిలర్ చిలుముల సునీల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎడ్ల గంగాభవాని, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్, నరేందర్ నాయుడు, 11వ వార్డు అధ్యక్షుడు చందా సైదులు, మాజీ ఎంపీటీసీ రాపర్తి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ వెంకట్ లాల్, దేవాలయ చైర్మన్ కొండ వెంకన్న, నాయకులు చింత సైదులు, చిలుక ఆనంద్, లంజపెల్లి సురేష్, చేరుకుపల్లి సంజీవ, కృష్ణయ్య, మంగపండ్ల మల్లేష్, బట్టు నాగరాజు, సురారపు సైదులు, రాపర్తి శంకర్, పోకల ఉపేందర్, కిట్టు, ముదిరాజ్ సంఘం నాయకులు తుటిపల్లి శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ ఢీ కొట్టడంతో వ్యక్తి దుర్మరణం..

కనగల్లు, ఆగస్టు 13 (జనం సాక్షి)



కనగల్లు వాగు నుంచి ఇసుకను నింపుకొని నల్లగొండకు వెళుతున్న ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ అతివేగం, ఆ జాగ్రత్త తో చిరు వ్యాపారస్తులు చండూరు వాసి కర్నాటి సత్తయ్య (60) ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలైన సత్తయ్యను 108 సహాయంతో చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సత్తయ్య రోజువారి లాగానే గురువారం రోజు ఇడ్లీలను వీధి వీధికి తిరుగుతూ అమ్ముకొని కనగల్ సెంటర్ కు రోడ్డు ప్రక్కనుంచి నడుచుకుంటూ వస్తున్న క్రమంలో వెనుక నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ అతివేగంగా వచ్చి కనగల్ మండల కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదురుగా సత్తయ్యను ఢీకొట్టడంతో క్రింద పడ్డ సత్తయ్య పైనుంచి టా క్టర్ దూసుకెల్లడంతో కాళ్లు విరగడం, నడుము భాగం నుంచి వెళ్లడంతో బలమైన గాయాలు తగిలి ప్రాణాపాయ స్థితిలో ఉన్న సత్తయ్యను మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలియజేశారు .భార్య రామలింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టార్టంకు పంపినట్లుచినట్లు స్థానిక ఎస్సై కే రాజీవ్ రెడ్డి తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఓ కూతురు ఉన్నారు.

## వార్డు సభ్యుల ఫోరం ఇంచార్జీగా బట్టు చంద్రకళఠాగూర్ నాయక్ నియామకం

చిలుకూరు,ఆగస్టు 13(జనంసాక్షి):



తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశానుసారం సూర్యాపేట జిల్లా వార్డు మెంబర్ల ఫోరం ఇన్చార్జి షేక్ నజీర్ పాషా ఆధ్వర్యంలో కోదాడ నియోజకవర్గ వార్డు మెంబర్ల ఫోరం ఇన్చార్జిగా చిలుకూరు మండలం జానకి నగర్ గ్రామ 5వ వార్డు మెంబర్ గా ఎన్నికైన బట్టు చంద్రకళఠాగూర్ ని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా బట్టు చంద్రకళ ఠాగూర్ మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ వార్డు మెంబర్ల ఫోరం ఇన్చార్జిగా నా శ్రమను గుర్తించి నన్ను నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన ఈ బాధ్యతతో వార్డు మెంబర్ల హక్కుల సాధనకై నిరంతరం పోరాడతానని తెలిపారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయం



సూర్యాపేట (జనంసాక్షి):

వార్డు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం శిబిరం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని 1వ వార్డులో కౌన్సిలర్ బానోతు సైదులు నాయక్ ఆధ్వర్యంలో వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు.కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సేవా దృక్పథంతో ఈ క్యాంప్ ఏర్పాటు చేసిన కౌన్సిలర్ సైదులు నాయక్ ను, వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.నేత్ర పరీక్షలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పిటిసి చింతమళ్ల రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ తన్వీర్ హుస్సేన్, చిలుముల సునీల్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నరేందర్ నాయుడు, గుర్రం ప్రకాష్ రెడ్డి, బూర సైదులు గౌడ్, బానోతు సురేష్, శేఖర్, నవీన్,సతీష్, మనోహర్,సైదులు, జానీపాషా, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# యాగాల పేరుతో రేవంత్ రెడ్డి నాటకాలు

◆రైతుల సమస్యలను పట్టించుకోకుండా యాగాల పేరుతో ప్రచార ఆర్భాటాలు

◆బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్ తీవ్ర ధ్వజం

**గుర్రంపోడు ఆగస్టు 13 (జనంసాక్షి)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాగాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని, రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పక్కదారి పట్టించేందుకే ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్ తీవ్రంగా విమర్శించారు. నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్, తెలంగాణ ప్రైవేటు ఉద్యోగస్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మునుకుంట్ల రాజేష్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని వారు ఆరోపించారు.రైతాంగాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం.ఎన్నికల సమయంలో రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పిజిఆర్ విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి యాగాల పేరుతో హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు.రైతుల పొలాల్లో పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం మాత్రం ప్రచార ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా యాగాలు, ప్రచార కార్యక్రమాలను పక్కన పెట్టి రైతుల సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.



**ఎండిపోతున్న పంటలను కాపాడాలి**

రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని పిజిఆర్ కోరారు. ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రచార ఆర్భాటాలు కాదు.. రైతుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వానికి ప్రాధాన్యత కావాలి. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, కష్టాల్లో ఉన్న రైతాంగానికి అండగా నిలవాలి" అని పిజిఆర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాశం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

**-మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్**

**హుజూర్ నగర్, ఆగస్టు 13 (జనంసాక్షి) :**

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని గోవిందపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ నూతన పాఠశాలల నిర్మాణానికి, అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు రాణించాలని కోరారు. వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను విద్యార్థులు నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో 8, 9 వార్డు కౌన్సిలర్లు కోల ఉదయభాను, బొల్లెద్దు ధనమ్మ, కె. నాగేశ్వరరావు, హెచ్ఎంలు గొట్టె శ్రీనివాస్ యాదవ్, దాడి నర్సిరెడ్డి, రేణుక, వీరస్వామి, శేఖర్, జనార్దన్ రెడ్డి, గొట్టేముక్కల రాములు పాల్గొన్నారు.

## కోదండ రామస్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా శరత్ చంద్రకుమార్

చిలుకూరు,ఆగస్టు 13 (జనంసాక్షి): చిలుకూరు మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానానికి నూతన కార్యనిర్వహణ అధికారిగా మరిగంటి శరత్ చంద్రకుమార్ నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసినటువంటి ఆలయ మేనేజర్ కొంకపాక మృత్యుంజయ శాస్త్రి ఇప్పటి వరకు ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు మాజీ చైర్మన్ ,కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## కనకదుర్గ ఆలయంలో వరలక్ష్మి వ్రతం ప్రత్యేక పూజలు శ్రావణమాసం సందర్భంగా ఘనంగా ఏర్పాట్లు తెలిపిన చైర్మన్ ఆంజనేయులు గౌడ్

**చిట్యాల ఆగస్టు 13 (జనం సాక్షి):**



చిట్యాల కనకదుర్గ సెంటర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా వరలక్ష్మి వ్రత మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ తెలిపారు.ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 14న శాకాంబరి అలంకరణ, గోపూజ, ఆగస్టు 21న సామూహిక వరలక్ష్మి వ్రతం, ఆగస్టు 28న కుంకుమార్చన, సెప్టెంబర్ 4న పుష్పాభిషేకం, సెప్టెంబర్ 11న 108 లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.మొదటి శుక్రవారం కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరవుతారని తెలిపారు. అర్చకులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.కార్యక్రమాలను ఆలయ కమిటీ డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకాంతం నరసింహారెడ్డి, రుద్రారపు లింగయ్య, జిట్ట సాయిలు, బెలిదే సత్యనారాయణ పర్యవేక్షిస్తారని చైర్మన్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆంజనేయులు గౌడ్ కోరారు.

## నూతన ఎస్సైగా శ్రీకాంత్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

**వలిగొండ, ఆగస్టు 13 (జనం సాక్షి )**



వలిగొండ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా శ్రీకాంత్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు పోలీస్‌శాఖ పై నమ్మకం కలిగేలా విధులు నిర్వహిస్తూ, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

## రూప హత్య పరిసరాలు పరిశీలించిన ఎస్పి శరత్ చంద్ర పవార్

**కొండమల్లేపల్లి, ఆగస్టు 13 (జనంసాక్షి):**



కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రూప రెడ్డి హత్యకు గురైన ఇంటిని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ గురువారం పరిశీలించారు. ఇంటి పరిసరాలలో తిరిగి నిందితుడు ప్రవేశించిన విధానాన్ని హత్య చేసిన ప్రాంతాన్ని ఆయన ఇల్లు అంతా తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. నిందితుడు ఏ మార్గంలో వచ్చాడు ఎలా దాడి చేశాడు అనే కోణంలో ఇంటిని అంతటా కలియదిరిగారు. అనంతరం రూప రెడ్డి భర్త రాజేందర్ రెడ్డిని అడిగి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి హత్య జరిగిన గదిని పరిశీలించి డిఎస్పి శ్రీనివాస్ రావు, సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్ లను కూడా కేసు విషయమై విచారణ తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ మూడు బృందాలుగా పోలీస్ సిబ్బంది విచారణ చేపడుతున్నారని సిసి ఫుటేజ్ ఫింగర్ ప్రింట్ తో పాటు అన్ని కోణాల్లో కేసును విచారించి నిందితుడిని గుర్తించి పట్టుకొని హత్య కేసును అతి తొందరలోనే ఛేదిస్తామని ఎస్పి తెలిపారు. కేసు దర్యాప్తును పారదర్శకంగా తక్షణమే పూర్తి చేయాలని స్థానిక పోలీసు అధికారులను ఎస్పి ఆదేశించారు. అనంతరం కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించి పాత కేసుల పురోగతిని, పోలీస్ స్టేషన్ రికార్డులను, పోలీసుల పనితీరును, పోలీస్ స్టేషన్ స్థానిక పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పట్టణంలోని శాంతిభద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు అవగాహన కల్పించారు. వారివెంట స్థానిక పోలీసులు వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను రద్దు చేయాలి - బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు,ఆగస్టు 13(జనంసాక్షి):

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సెప్టెంబర్ 1న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద లక్షలది మందితో భారీ నిరసన ప్రదర్శన మరియు 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి పిలుపునిచ్చిన సందర్భంగా ఈనెల 6 నుంచి 14 వరకు జరిగే ప్రజా చైతన్య, పాదయాత్రలలో భాగంగా చిలుకూరు మండల పార్టీ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్ కె సాహెబ్ అలీ నాయకత్వంలో పాత చిలుకూరు సిపిఐ పార్టీ కార్యాలయం నుండి మోటార్ సైకిళ్ళతో ప్రజా చైతన్య యాత్రను పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "బద్లావ్ జరూరి హై" (మార్పు కావాలి) అనే ప్రధాన నినాదంతో నిత్యావసర వస్తువుల ధరలు వెంటనే తగ్గించాలని, విద్య, వైద్యం ఉచితంగా అందించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వ్యవసాయ రంగాన్ని రైతులను హరించి వేసే విదేశీ విధాన స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం తక్షణం రద్దు చేయాలని కార్మిక హక్కులను హరించి వేసే నాలుగు లేబర్ కోడులు రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించి 200 రోజులకు పని దినాలు పొడిగించి 700 రూపాయల కూలి పెంచాలని, ఈ పథకానికి బడ్జెట్లో కావాల్సిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రజా చైతన్య యాత్ర చిలుకూరు, దూదియా తండా, శీతలతండా, నారాయణపురం, సీతారామపురం,సుబ్బోరిగూడెం,బేతవోలు గ్రామాల మీదుగా జెర్రిపోతులగూడెం గ్రామంలో ముగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నంద్యాల రామిరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చేపూరి కొండలు, వ్యకాస జిల్లా అధ్యక్షులు రెమిడాల రాజు, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య,పార్టీ శాఖ కార్యదర్శులు చిలువేరు ఆంజనేయులు, తాళ్లూరు వెంకటయ్య,బెజవాడ వినోద్, కందుకూరి శ్రీను,మండల నాయకులు దొడ్డ నాగేశ్వరరావు, కస్తూరి సైదులు, తాళ్లూరి రామారావు,నేలపట్ల జనార్దన్, కీసర కొండలు,కొడారు శీను, బాలెబోయిన మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# వేపచెట్టు కొమ్మకు బలైన బాలిక

**◆బగాయత్ పాఠశాలలో విషాదం ◆ ఆటలాడుతున్న చిన్నారులపై విరిగిపడిన కొమ్మ.. పలువురికి తీవ్ర గాయాలు ◆ ప్రమాదకర చెట్లపై అధికారుల పర్యవేక్షణ ఏది? ? బాలిక కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి ◆ బాలల హక్కుల పరిరక్షణ వేదిక**








**భువనగిరి, ఆగస్టు 13 (జనంసాక్షి)**
భువనగిరి జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ చౌరస్తా సమీపంలోని బగాయత్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పాఠశాల ఆవరణలో ఆటలాడుతున్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులపై అకస్మాత్తుగా వేపచెట్టు కొమ్మ విరిగిపడటంతో పలువురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో భువనగిరి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దావూద్ అలీ, అమీనా దంపతుల కుమార్తె, మూడో తరగతి విద్యార్థిని అలీమ మృతి చెందింది. దీంతో పాఠశాల ఆవరణలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**భయంతో పరుగులు.. పలువురికి గాయాలు**
విద్యార్థులు ఆటలాడుతున్న సమయంలో ఒక్కసారిగా భారీ కొమ్మ విరిగి వారిపై పడటంతో చిన్నారులు భయంతో పరుగులు తీశారు. ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఉపాధ్యాయులు వెంటనే స్పందించి గాయపడిన విద్యార్థులను భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం అవసరమైన నలుగురు విద్యార్థులను వైద్యుల సూచన మేరకు బీబీనగర్ ఎయిమ్స్‌కు తరలించారు. వారిలో హర్షిత్ సహా మరో విద్యార్థికి కాళ్లకు గాయాలైనట్లు వైద్యులు వెల్లడించినట్లు సమాచారం.

**ప్రమాదానికి ముందే హెచ్చరికలున్నాయా?**
పాఠశాల ఆవరణలో ప్రాథమిక పాఠశాలతో పాటు హైస్కూల్, జిల్లా గ్రంథాలయ సంస్థ కూడా ఉన్నాయి. ఇంతటి ప్రదేశంలో ప్రమాదకరంగా ఉన్న చెట్లను ముందుగానే గుర్తించి తొలగించాల్సిన అధికారులు పర్యవేక్షణలో విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల కథనం ప్రకారం పాఠశాల ఆవరణ రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, ఇటీవల కొందరు వ్యక్తులు ఓ వేపచెట్టుకు నిప్పంటిం చడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పినట్లు చెబుతున్నారు. చెట్టు కాలిపోవడంతో దాని మొదలు బలహీనపడి, అనంతరం కొమ్మ విరిగిపడినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది.

**అలీమ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి**
చిన్నారి అలీమ మృతి అత్యంత బాధాకరమని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకులు కొడారి వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద కుటుంబానికి చెందిన బాలిక ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదమన్నారు. అలీమ కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలోని ప్రమాదకర చెట్లు, భవనాలు, విద్యార్థుల భద్రతకు ముప్పుగా ఉన్న ఇతర అంశాలను అధికారులు తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నారుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## నాగులపాటి అన్నారం, అన్నారం బ్రిడ్జి గ్రామాలలో బోనాల పండుగ సందడి

**పెన్ పహాడ్ ఆగస్టు 13 (జనం సాక్షి) :**మండల పరిధిలోని నాగులపాటి అన్నారం. అన్నారం బ్రిడ్జి గ్రామలలో గురువారం అంగరంగ వైభవంగా బోనాల పండుగ నిర్వహించారు. డబ్బు చప్పులతో, భాజా భజంతులతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయి. పోతురాజు. ముత్యాలమ్మ గ్రామ దేవతల ముందు తమ మొక్కలు తీర్చుకున్నారు. ప్రభ బండ్లతో బొడ్రాయి. ముత్యాలమ్మ దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ముత్తినేని శ్రీనివాస్. సుందరి రామారావు. లిఫ్ట్ ఇరిగేషన్ మాజీ అధ్యక్షుడు ధనియాకుల సత్యనారాయణ, మత్స్య సహకార సంఘం చైర్మన్ బంటు శైలా గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు. లావణ్య నగేష్. సందీప్. ఉపేంద్ర రవి. సతీష్. రమణయ్య. వివిధపార్టీల నాయకులు.. గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## విగ్రహాల ప్రతిష్టాపన హాజరైన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



**అడ్డగూడూరు/ఆగస్టు 13(జనం సాక్షి)**
అడ్డగూడూరు మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ,మహంకాళి, మారమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు హాజరైనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు వేద పండితులు పూర్ణకుంభం తో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం మందుల సామేలు మాట్లాడుతూ మహంకాళి, ముత్యాలమ్మ, మారమ్మ దేవతల ఆశీస్సులు గ్రామ ప్రజల పైన ఉండాలని పాడి పంటలు మంచిగా పండి రైతులందరూ సంతోషంగా ఉండాలని అన్నారు. గ్రామ అభివృద్ధికి, దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుండి అన్ని విధాల సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల మేరీ ఆనంద్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, నిమ్మనగోటి జోజి, బాలెంల విద్యాసాగర్,పాశం సత్యనారాయణ, వల్లంభట్ల రవీందర్, గంగరాజు, పూర్ణ,రమేష్, నరసయ్య, వెంకన్న, రమేష్, గ్రామ పెద్దలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాలు..

**రామన్నపేట, ఆగస్టు 13 (జనంసాక్షి):**
మండల పరిధిలోని కక్కిరేణి గ్రామంలో గురువారం మహిళలు ముత్యాలమ్మ తల్లికి అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా బోనాలు నిర్వహించారు. డప్పువాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి ప్రదర్శనగా వెళ్లి మొక్కులు సమర్పించారు. గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని గ్రామ దేవతలకు నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం ముత్యాలమ్మ తల్లికి పసుపు, కుంకుమలతో చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఏర్పాటు చేయాలి

### సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం విద్యార్థుల భారీ ర్యాలీ

సూర్యాపేట (జనంసాక్షి):
జాతీయ రహదారి 65కు సమాంతర బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన కోసం గురువారం సూర్యాపేటలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించిన ర్యాలీ అనంతరం వాణిజ్య భవన్ సెంటర్ లో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి 65కు సమాంతరంగా ఫిబ్రవరిలో బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ మంజూరు చేసి ఒక్కసారిగా అలైన్మెంట్లు మార్చడానికి తీవ్రంగా పరిగణిస్తూ ఆందోళన చేశారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, విద్యార్థి సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ విషయంలో జరిగిన అన్యాయాన్ని అన్ని వర్గాల ప్రజలు గుర్తించాలన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొని బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోఐక్య విద్యార్థి సంఘం నాయకులు పుల్లూరి సింహాద్రి, ధనియాకుల శ్రీకాంత్ వర్మ, భాషపంగు సునీల్, ఎర్ర అఖిల్, బొమ్మగాని వినయ్, బారీ అశోక్, పోలోజు మహేష్, అహ్మద్ అలీ, పారాల సాయి, పోలెబోయిన కిరణ్, షేక్ జహంగీర్, వెంకటేష్ నాయక్, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.





## ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలపై 21న జిల్లా కేంద్రాల్లో ధర్నా.. 29న హైదరాబాద్ లో భారీ నిరసన.

తుంగతుర్తి ఆగస్టు 13 (జనం సాక్షి)
ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించని యెడల ఈనెల 21న జిల్లా కేంద్రాల్లో 29న హైదరాబాదులో భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ తెలిపారు, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలో తహసీల్దార్ దయానందం కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్పీసీ నాయకులు మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి, తుంగతుర్తి మండల అధ్యక్షుడు మల్లెపాక రవీందర్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు కాచుగల్ల నవీన్ ప్రసాద్ మాట్లాడుతూ... పీఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు దాటినా ప్రభుత్వం జాప్యం చేస్తోందని అన్నారు. పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించి 2023 జూలై నుంచి అమలు చేయాలని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 21న జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని, 29న హైదరాబాద్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని నాయకులు హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ మండల నాయకులు మందడి సూర్యప్రకాష్, బీవనపల్లి శ్రీనివాస్, కోట స్టాలిన్, గుండ్ల ఆంజనేయులు, కొమ్ము గణేష్, జీడి అనిల్‌కుమార్, బరిగెల నవీన్‌కుమార్, బానోతు రవికుమార్, గుండగాని సుధాకర్, దరావత్ బాలాజీ, షేక్ హబీబ్, ఉబ్బపల్లి బాలయ్య, చంద్రకళ, బండారు మమత, మేధం నవీన్ తదితరులు పాల్గొన్నారు.